# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




సుఖాలను తెదించమని వేదాంతం చెప్పదు, కానీ వాటిని అతిక్రమించి అతీతులమని అంటుంది.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 19 ఆదివారం 26 ఫిబ్రవరి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## 18 దేశాల్లో వందే భారత్ పై చర్చ



**బెంగళూరు :**

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌పై దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా చర్చ జరుగుతోంది. ఎన్నో ఏళ్లుగా రైల్వే టెక్నాలజీని దిగుమతి చేసుకుంటున్న భారత్ నేడు స్వయం సమృద్ధి సాధించింది. ఈ విషయంపై ప్రపంచంలోని 18 దేశాల్లో చర్చ నడుస్తోందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ విజయం వెనుక రహస్యాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన పలు విశేషాలను పంచుకున్నారు. వందేభారత్ విజయం అంతా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఘనతే అన్నారు. భారత్‌లో ప్రపంచ స్థాయి రైలును తీసుకురావాలని ఐదేళ్ల క్రితమే అంటే 2017లో మోదీజీ చెప్పారని ఆయన అన్నారు. కానీ, ఈ రైలు డిజైన్ తయారీ మొత్తం దేశంలోనే జరగాలనే షరతు విధించారన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను కేవలం ఏడాదిన్నర

(మిగతా 2లో)

## రాజకీయాలకు సోనియా గుడ్‌బై

**రాయ్‌పూర్ :**



కాంగ్రెస్ ఎంపీ, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ రాజకీయాల నుంచి తప్పుకోవడం గురించి ప్రస్తావించారు. భారత్ జోడో యాత్రతో తన ఇన్నింగ్స్ పూర్తికానుండటం సంతోషంగా ఉందని చెప్పారు. భారత్ జోడో యాత్రను పార్టీకి ఒక మేలి మలుపుగా ఆమె అభివర్ణించారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న పార్టీ 85వ ప్లీనరీలో రెండవ రోజైన శనివారం ఆమె ప్రసంగిస్తూ... "భారత్ జోడో యాత్రతో నా ఇన్నింగ్స్ ముగుస్తుండటం చాలా సంతోషం కలిగిస్తోంది. దేశాన్ని ఒక మలుపు తిప్పిన యాత్ర ఇది. సామరస్యం, సహనం, సమానత్వాన్ని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారని ఈ యాత్ర రుజువు చేసిందని అన్నారు.

డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలో 2004, 2009లో సాధించిన విజయాలు తనకెంతో సంతప్తినిచ్చాయని, కాంగ్రెస్ పార్టీని మలుపుతిప్పిన భారత్ జోడో యాత్రతో ఇన్నింగ్స్ ముగించాలనుకోవడం సంతోషాన్నిస్తోందని సోనియాగాంధీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, యావద్దేశానికి కూడా ఇది సవాలు వంటి సమయమని, దేశంలోని ప్రతి వ్యవస్థనూ బీజేపీ-ఆర్ఎస్ఎస్ తమ అధీనంలోకి తీసుకుని చిన్నాభిన్నం చేస్తున్న తరుణమని ఆరోపించారు. కొద్దిమంది వ్యాపారవేత్తలకు అనుకూలంగా వ్యవహరించడం దేశ ఆర్థిక పతనానికి కారణమవుతోందని అన్నారు.కాంగ్రెస్ కేవలం ఒక రాజకీయ పార్టీ కాదని, అన్ని మతాలు, కులాలు, జెండర్ ప్రజల వాణిని ప్రతిబింబిస్తుందని, అందరి కలలను సాకారం చేస్తుందని అన్నారు. ప్రధానమంత్రి మోదీ, బీజేపీ ఈ దేశంలోని అన్ని వ్యవస్థలను తమ అధీనంలోకి తీసుకుంటున్నాయని ఆరోపించారు. బీజేపీ విదేశ్వాగ్ని రగులుస్తోందని, మైనారిటీలు, మహిళలు, దళితులు, గిరిజనులను టార్గెట్ చేసుకుంటోందని అన్నారు. రాజ్యాంగ నిర్దేశిత విలువలను

(మిగతా 2లో)



## ఎన్టీఆర్ కు పార్టీ ఇచ్చేయండి

**విజయవాడ :**

తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు, లోకేష్ పార్టీలపై తనదైన రీతిలో కామెంట్లు చేశారు మాజీ మంత్రి కొడాలి నాని. ఎన్టీఆర్ పేరు పది కాలాలపాటు వినిపించాలంటే పార్టీ బాధ్యతలు జూనియర్ కు ఇవ్వాలన్నారు కొడాలి నాని. ఎన్టీఆర్ పెట్టిన పార్టీలోకి జూనియర్ ఎన్టీఆరును లోకేష్ ఆహ్వానించడ మేంటీ..?చంద్రబాబు, లోకేష్ కు నిశ్వసనీయత లేదు.పార్టీని కాపాడ్డం తమ వల్ల కాదని చంద్రబాబు, లోకేషుకు అర్థమైంది.తమ విశ్వసనీయతపై తమకే నమ్మకం లేక.. జూనియర్ ఎన్టీఆరుని లోకేష్ ఆహ్వానించారు.పార్టీ బాధ్యతలు జూనియర్ కు అప్పజెబితే టీడీపీ ప్రతిపక్షంలో

(మిగతా 2లో)

## 29న టీటీడీపీ బహిరంగసభ

**హైదరాబాద్:**



ఖమ్మం బహిరంగసభ తర్వాత తెలంగాణ తెలుగుదేశం పార్టీ సైలెంట్ అయింది. మళ్లీ మార్చిలో భారీ బహిరంగసభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకుటోంది. ఈ సభకు కూడా టీడీపీ అధినేత చంద్రబాబు హాజరు కానున్నారు. మార్చి 29వ తేదీన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం. తెలుగుదేశం పార్టీని హైదరాబాద్‌లోనే ప్రారంభించారు. అందుకే హైదరాబాద్‌లోనే వ్యవస్థాపక దినోత్సవాన్ని భారీగా నిర్వహించాలని నిర్ణయించారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీ నేతలు ఇప్పటికే ఈ విషయంపై చంద్రబాబు అనుమతి కూడా తీసుకున్నారు. ఏర్పాట్లు ప్రారంభించనున్నారు. తెలంగాణ టీడీపీకి కొత్త అధ్యక్షుడిగా నియమితులైన కాసాని జ్ఞానేశ్వర్ ప్రతి ఉమ్మడి జిల్లాలోనూ సభను నిర్వహించాలన్న ఉద్దేశంలో ఉన్నారు. పరేడ్ గ్రౌండ్స్‌లో రాజకీయ పార్టీలు సభలు నిర్వహిస్తూ ఉంటాయి. ఇటీవల తెలంగాణ సచివాలయాన్ని ప్రారంభించిన తర్వాత పరేడ్ గ్రౌండ్స్‌లోనే సభ నిర్వహించాలని కేసీఆర్ అనుకున్నారు. కానీ సచివాలయం వాయిదా పడటంతో సభ నిర్వహణ కూడా ఆపేశారు. వచ్చే నెల 29న తెలుగుదేశం పార్టీ ఇదే గ్రౌండ్‌లో సభ నిర్వహించాలనుకుంది. తెలుగుదేశం పార్టీ ఇటీవలి కాలంలో తెలంగాణలో స్తబ్దుగా ఉంది. అయితే కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్టీ అధ్యక్షుడిగా చేసిన తర్వాత కదలిక వచ్చింది. ఖమ్మం సభను అనుకున్నదాని కన్నా ఎక్కువగా విజయవంతం చేసుకున్నామని టీడీపీ కార్యకర్తలు నమ్ముతున్నారు. వచ్చిన జనం అంతా పక్క జిల్లాల నుంచి వచ్చారని బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పించారు. అయితే ప్రజల్లో టీడీపీపై ఇప్పటికీ సానుభూతి ఉందని.. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన పార్టీ టీడీపీనేనని వారంటున్నారు. మార్చి 29న పరేడ్ గ్రౌండ్స్ సభకు కూడా భారీగా జన సమీకరణ చేసి సత్తా చాటాలని తెలుగుదేశం పార్టీ నేతలు నిర్ణయించుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో తెలుగుదేశం పార్టీకి గట్టి బలముందని అంటున్నారు. నేతలు పార్టీలు మారి వెళ్లిపోయిన క్యాడర్, టీడీపీ సానుభూతిపరులు మాత్రం పార్టీకే అండగా ఉంటారని అంటున్నారు. ఈ క్రమంలో సభను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అనుకుంటున్నారు. చంద్రబాబు కూడా హాజరు కానున్నారు. ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పార్టీకి బలం ఉందని భావిస్తున్న నియోజకవర్గాల్లో పోటీ చేయాలని టీడీపీ భావిస్తోంది. కనీసం నలభై నియోజకవర్గాల్లో పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లుగా చెబుతున్నారు. ఎక్కువగా గ్రేటర్ హైదరాబాద్ , ఖమ్మం నల్లగొండ,

(మిగతా 2లో)



## వైసీపీ గుర్తు రద్దు చేయండి

**న్యూఢిల్లీ :**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్ష పదవి నిర్వహించడం లేదని.. నిబంధనలు ఉల్లంఘిస్తున్న తమ పార్టీని రద్దు చేయాలని ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్లుగా ఎంపీ రఘురామకృష్ణరాజు ప్రకటించారు. ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన తాను ఎన్నికల సంఘానికి లేఖ రాసిన విషయాన్ని చెప్పారు. తమ పార్టీకి అధ్యక్ష ఎన్నికలు నిర్వహించడం లేదని ఆయన అంటున్నారు. ఇటీవల ప్లీనరీలో శాశ్వత అధ్యక్షుడిగా జగన్ ను నియమిస్తూ తీర్మానం చేశారని..కానీ అది చట్ట ప్రకారం చెల్లుబాటు కాదన్నారు. తర్వాత ఈ అంశాన్నివెనక్కి తీసుకుంటున్నట్లుగా చెప్పారు కానీ.. మళ్లీఅధ్యక్ష పదవి నిర్వహించలేదన్నారు. ఒక వేళ నిర్వహించకపోతే తమ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని ఆయన ఈసీకీ రాసిన లేఖలో పేర్కొన్నారు. పార్టీ నుంచి తనను సస్పెండ్ చేయలేదుకాబట్టి.. ఎన్నికలు నిర్వహిస్తే తాను వైసీపీ అధ్యక్ష పదవికి పోటీ చేస్తానని రఘుఉరామచెబుతున్నారు. తమ పార్టీ వైఎస్ఆర్‌సీపీనా లేకపోతే యువజన శ్రామిక

(మిగతా 2లో)

# 18 దేశాల్లో వందే భారత్ పై చర్చ

(మొదటిపేజీ తరువాయి)

కాలంలోనే నిర్మించామని రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. ఇది ప్రయాణికుల భద్రత, ఇతర సమస్యలపై నిరంతరం పని చేస్తుంది. ప్రపంచంలో కేవలం ఎనిమిది దేశాలు మాత్రమే గంటకు 160 కి.మీ వేగంతో రైలు మార్గాలు నడుపుతున్నాయి. ఇది భారతదేశానికి వందే భారత్‌ను పెద్ద విజయాన్ని అందించింది. ఇప్పుడు తదుపరి దృష్టి గంటకు 220 కి.మీ. వచ్చే మూడేళ్లలో రైల్వే టెక్నాలజీని భారత్ ఎగుమతి చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.మొదటి 'వందేభారత్ రైలు' 2018లో నిర్మించబడింది. ప్రస్తుతం దేశంలోని నాలుగు రైల్వే ఫ్యాక్టరీలలో 'వందే భారత్' రైలు ఉత్పత్తి జరుగుతోంది.. దాని విడి భాగాలు, కోచ్‌లను కూడా లాతూర్‌లోని కొత్త ఫ్యాక్టరీలో తయారు చేస్తారు. వందేభారత్ అనేది ఇంజిన్ లేని 16-కోచ్ రైలు, ప్రతి కోచ్ వెనుక ఒక మోటర్‌కోచ్ జోడించబడింది. కాబట్టి ఆమె చక్రాలలో యాభై శాతం మోటారు శక్తిని పొందుతాయి. దీని గరిష్ట వేగం గంటకు 160 కి.మీ. అంతే. దాని మోటారుతో సహా అన్ని ఎలక్ట్రికల్ భాగాలు కంపార్ట్మెంట్ దిగువ భాగంలో అమర్చబడి ఉంటాయి. ఈ రైలు ప్రారంభం నుండి కేవలం ఏడు సెకన్లలో వేగవంతమవుతుంది.

# రాజకీయాలకు సోనియా గుడ్‌బై

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ చర్యలు కాలరాస్తున్నాయని చెప్పారు. మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించే లక్ష్యంతో కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్లీనరీ రెండో రోజు కార్యక్రమంలో 15,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఇతర విపక్ష పార్టీలతో పొత్తులతో సహా 2024 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన కీలక నిర్ణయాన్ని ఈ ప్లీనరీలో తీసుకోనున్నారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ సారథ్యంలో చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతంగా ముగిసిన తర్వాత తొలిసారి జరుగుతున్న ప్లీనరీ కావడంతో కాంగ్రెస్ సైతం భారీ అంచనాలు పెట్టుకుంది. మొదటి రోజు జరిగిన ప్లీనరీలో, పార్టీ టాప్ కౌన్సిల్ సీడబ్ల్యూసీకి ఎన్నికలు నిర్వహించ రాదని కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సీడబ్ల్యూసీ సభ్యులను నామినేట్ చేసే అధికారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు అప్పగించాలని కమిటీ నిర్ణయించింది.కాగా, భారత్ జోడో యాత్రతో తన రాజకీయ ఇన్నింగ్స్ ముగియనుందంటూ సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# 29న టీటీడీపీ బహిరంగసభ

(మొదటిపేజీ తరువాయి)

నిజామాబాద్ జిల్లాల్లో పోటీ చేసే అవకాశం ఉంది. అందుకే ఈ ప్రాంతాల్లో సభల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలంగాణలో టీడీపీ రాజకీయాలు.. ఏపీలోనూ రాజకీయాలను ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో తెలుగుదేశం పార్టీ మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తెలంగాణలో టీడీపీ ఎవరితోనైనా పొత్తులు పెట్టుకుంటుందా అన్న చర్చ ఇప్పటికే జరుగుతోంది. అయితే టీడీపీ మాత్రం ఎవరితో పొత్తులు ఉండవని చెబుతోంది. బీజేపీ కూడా ఎలాంటి పొత్తులు ఉండవని ప్రకటించింది. మరో వైపు టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చిన కేసీఆర్ ఏపీలోనూ శాఖను ప్రారంభించారు. త్వరలో ఏపీలో బహిరంగసభ పెట్టాలనుకుంటున్నారు.

# ఎన్టీఆర్ కు పార్టీ ఇచ్చేయండి

(మొదటిపేజీ తరువాయి)

నైనా ఉంటుంది .తెలుగుదేశం పార్టీ ఊబి లాంటిది.. ఆ పార్టీని కాపాడేందుకు ఎవరెళ్లినా కూరుకుపోవడం ఖాయం.ఎన్టీఆర్ సొంత నియోజకవర్గం పామర్రు, చంద్రబాబు సొంత నియోజకవర్గం చంద్రగిరి, లోకేష్ పోటీ చేసిన మంగళగిరిలో పార్టీని గెలిపించలేని వాళ్లు.. టీడీపీని ఏం రన్ చేస్తారు.మార్పు కావాల్సింది టీడీపీలోనే.. రాష్ట్రంలో కాదు.మంగళగిరిలో లోకేష్ తరపున బ్రహ్మణి ప్రచారం చేసినా ఓడిపోయాడు.కానీ బ్రాహ్మణినే పోటీ చేసుంటే గెలిచేవారు.లోకేష్ కు విశ్వసనీయత లేదు.తనను వాడుకుని ఆ తర్వాత ఎలా అవమానించారో జూనియర్ కు తెలీదా..?2009 తర్వాత జరిగిన మాహానాడులో లోకేష్ కోసం జూనియర్ ను అవమానించారు.2014 ఎన్నికల్లో గెలిచాక ప్రమాణస్వీకారోత్సవం కార్యక్రమంలో జూనియర్ ను గ్యాలరీలో కూర్చొబెట్టి అవమానించారు.చంద్రబాబు ఎలాంటి వాడో తన తాత, తండ్రి, మేనత్తలు చెప్పింది జూనియర్ వినే ఉంటాడు.చంద్రబాబు చేసే అవమానం ఎలా ఉంటుందో స్వయంగా జూనియర్ ఫేస్ చేశాడు.

# వైసీపీ గుర్తు రద్దు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

రైతు కాంగ్రెస్ పార్టీనా అనేది క్లారిటీ లేదని.. దీనిపైనా స్పష్టత ఇవ్వాలని కోరారు. గతంలో ఈ అంశంపై రఘురామ కోర్టుకెళ్లారు. ఆ తర్వాత వైఎస్ఆర్‌సీపీ నేతలు తమ లెటర్ ప్యాడ్ల మీద యువజన శ్రమిక రైతు కాంగ్రెస్ పార్టీ అని పేరు మార్చారు. అయితే షార్ట్ కట్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని పిలుస్తున్నారు. ఇప్పుడు ఏకంగా పార్టీ గుర్తింపురద్దు చేయాలని ఆయన ఈసీ దగ్గర పిటిషన్ దాఖలు చేయడం సంచలనంగా మారింది. జూలైలో నిర్వహించిన ప్లీనరీలో తమ పార్టీ రాజ్యాంగంలో సవరణలు చేస్తున్నట్టు తీర్మానాలు చేశారు. వైఎస్ జగన్‌ని జీవితకాల అధ్యక్షుడిగా ప్రకటించారు. అధ్యక్ష నియామకంలో మార్పులతో పాటుగా పార్టీ రాజ్యాంగం సవరణల ప్రతిపాదనలకు కూడా ప్లీనరీ ఆమోదం తెలియజేసింది. పార్టీ రాజ్యాంగంలోని ఆర్టికల్ -1 ప్రకారం... యువజన, శ్రామిక, రైతు కాంగ్రెస్ పార్టీని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీగా లేదా వైఎస్సార్సీపీగా మారుస్తూ తీర్మానం చేశారు. ఇకపై ఎన్నికల సంఘం వద్ద కూడా పార్టీని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీగా ప్రస్తావిస్తారని తెలిపారు. అది పొడి అక్షరాల్లో వైఎస్సార్సీపీగా ఉంటుంది. తాజాగా ప్లీనరీలో చేసిన తీర్మానం ప్రకారం ఎన్నికల సంఘం ఈ రెండింటిలో ఏ పేరుకి అంగీకరిస్తే దానినే ఖరారు చేయాలి. పార్టీ శాశ్వత అధ్యక్షుడిగా జగన్ ఎన్నిక చెల్లదని తేల్చేంది ఈసీ. ఈ మేరకు సెప్టెంబర్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. ఏ పార్టీలోనైనా శాశ్వత పదవులు ఉండకూడదని స్పష్టం చేసింది. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకైనా ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఎన్నికలు జరగాలని పేర్కొంది. ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకి అయినా తరుచూ ఎన్నికలు జరుగుతూ ఉండాల్సిందేని చెప్పింది. ఏ పార్టీలోనూ శాశ్వత అధ్యక్షుడిగా, శాశ్వత పదవులు వర్తించవు అని పేర్కొంది. ఈసీ నియామవళికి తగ్గట్టుగానే రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ వ్యవహారాలన్నీ జరుగుతున్నాయని వివరించింది. అయితే ఆ తర్వాత వైసీపీ అధ్యక్ష పదవి ఎన్నిక నిర్వహించలేదు. ఈ కారణంగానే తమ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని రఘురామ ఈసీకి లేఖ రాశారు.

# ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగం లో పరిసరాల పరిశుభ్రత





**ప్రజా తపన :**

ప్రతి నెల చివర శనివారం పరిసరాల పరిశుభ్రతలో భాగంగా ఆంధ్రవిశ్వవిద్యాలయ తెలుగు విభాగం స్నాతకోత్తర విద్యార్దులుశ్రమదానం చేసి తెలుగు విభాగాన్ని,తెలుగు తోటను శుభ్రపరిచారు.తెలుగు తోటలోని వివిధ పిచ్చిమొక్కలను తొలగించి పూలమొక్కలకు పాదులు తయారుచేసారు.కొత్త పాదులలో పూలమొక్కలు నాటారు. తమ విభాగాన్ని శుభ్రం చేసుకోవటంలో ఏంతో ఆనందం ఉందని విద్యార్ధులకు విద్యతో పాటు విద్యేతర విషయాల పట్ల స్పృహ కలిగించినప్పుడు వారిలో సేవాదృక్పధం పెంపోందుతుందని తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు డా బూసి వెంకటస్వామి,డా పెండ్యాల లావణ్య ,స్నాతకోత్తర విద్యార్ధులు గొంటి బాబ్జీ,కె సత్యనారాయణ స్వామి,పి కుసుమ,ఆర్ శ్రావణి,బి అఖిల,వై నాగరాజు,వై సాయి,యం సందీప్ ,కె వీరన్న,కె సాయిశివ తదితరులు పాల్గొన్నారు .



# వలసల నివారణలో ప్రభుత్వ వైఫల్యం

**నంద్యాల**



కర్నూలు పశ్చిమ ప్రాంతం నుండి వలసలు ఆపడానికి కావలసిన చర్యలు చేపడతాం అని ప్రభుత్వం పదేపదే చేసే ప్రకటనలకు, ఆచరణకు పొంతనలేదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామి రెడ్డి విమర్శించారు. శనివారం నాడు రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ. ఈ ప్రాంతం నుండి వలసల నివారణకు తలాపుననే ప్రవహిస్తున్న తుంగభద్ర నది ఆధారంగా లక్ష యాభై ఒక్క వేయి ఎకరాల ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో ఎల్ ఎల్ సి నిర్మాణం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోనే జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. కానీ తుంగభద్ర దిగువ కాలువ ఆయకట్టు గత పది సంవత్సరాలుగా యాభై వేల ఎకరాలకు కూడా నీరందించని విషయాన్ని ఆయన వివరించారు. ప్రాజెక్టుకు కేటాయించిన నీటి కంటే అదనంగా తుంగభద్ర నదిలో ప్రవహిస్తున్న ఈ నీటిని సద్వినియోగం చేసుకోవడానికి చేపట్టాల్సిన కార్యాచరణపై పాలకుల నిర్లక్ష్యం ఈ ప్రాంతానికి శాపంగా మారిందని బొజ్జా ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సంవత్సరం సుమారు 600 టి ఎం సీ ల తుంగభద్ర జలాలు శ్రీశైలం రిజర్వాయర్ చేరినప్పటికి, ఎల్ ఎల్ సి ఆయకట్టులో సగానికి కూడా సాగునీరు అందంచలేకపోయారని తెలిపారు. ఎల్ ఎల్ సి ఆయకట్టుకు నీరందించకుండా, ఈ ప్రాజెక్టుకు తుంగభద్ర డ్యాం లో హక్కుగా ఉన్న నీటి నుండి 2 టి ఎం సీ లు తుంగభద్ర ఎగువ కాలువకు మళ్ళింపుకు జలవనురుల శాఖ ప్రతిపాదనలు చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు వై ఎన్ రెడ్డి, ఏర్వ రామచంద్రా రెడ్డి, కోశాధికారి చెరుకూరి వెంకటేశ్వర నాయడు, సభ్యులు పట్నం రాముడు, కొమ్మా శ్రీహరి, రామిరెడ్డి, రాఘవేంద్ర గౌడ్, భాస్కర్ రెడ్డి, ప్రజా సంబంధాల కార్యదర్శి నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

# 24 గంటలు కరెంట్ ఇస్తున్నాని నిరూపించండి

**వరంగల్:**




బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలంగాణ ప్రభుత్వానికి ఓ సవాల్ విసిరారు. రైతులకు 24 గంటల కరెంట్ వస్తుందని నిరూపిస్తే.. తాను ముక్కు నేలకు రాస్తానని ఛాలెంజ్ చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఖిలా వరంగల్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా మారి, భూములు అమ్ముకుంటోందని ఆరోపణలు చేశారు. ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్స్ కట్టిస్తామని హామీ ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం.. ఇంతవరకు పేదలకు గానీ, రైతులకు గానీ ఇళ్ల జాగాలు ఇవ్వలేదని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్‌తో ప్రజలు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. దేశంలోనే ఎక్కువగా మద్యం తాగే రాష్ట్రంగా తెలంగాణ రికార్డులకెక్కిందని వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం వస్తే పింఛన్లు పోతాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే పింఛన్లు ఎక్కడా పోవని, ఇంకా పెంచుతామని హామీ ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం పోతేనే మన పిల్లల బతుకులు బాగు పడతాయని అన్నారు.అంతకుముందు.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభు□త్వం అన్ని వ్యవస్థలను నిర్వీ□ర్యం చేసిందని ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. అన్ని వర్గాలను అరిగోస పెడుతున్న కేసీఆర్ ప్రభుత్వం, ఇంకా కొనసాగడం రాష్ట్రానికి అరిష్టమని విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం లేకుండా పోయిందని.. అణగారిన వర్గాలు, మహిళలను అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ సర్కార్ రైతు బంధు పేరుతో డబ్బిలిచ్చి, ధాన్యం తరుగు పేరిట నిలువునా దోచుకుంటున్నారని అన్నారు. "దేశంలో తెలంగాణ నెంబర్ వన్ అని కేసీఆర్ అంటున్నాడు.. ఎందులో తెలుసా? ఏ రాష్ట్రానికి లేని లిక్కర్ ఆదాయంలో నెంబర్ వన్" అంటూ వ్యాఖ్యానించారు. 2018లో 70 లక్షల మహిళా ఓట్ల కోసం మహిళ సంఘాలకు వడ్డీ మాఫీ ఇస్తే.. ఇప్పటివరకు మాఫీ కాలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఒకపక్క కల్యాణ లక్ష్మితో పెళ్లిళ్లు చేస్తూనే.. మరోపక్క లిక్కర్ తాగించి పుస్తెలతాడు తెంపుతోందని అన్నారు. మోటార్ల కరెంట్ బిల్లు లేక రైతుల నుండి ఏసీడీ పేర వసూల్ చేస్తున్నారని పేర్కొన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# వివేకా చుట్టూ రాజకీయ రచ్చ

**కడప :**



వివేకా హత్య కేసులో ఓవైపు సీబీఐ విచారణ జరుగుతోంది. దానికి సమాంతరంగా పొలిటికల్ ఇంటరాగేషన్ కూడా నడుస్తోంది! రోజుకో కొత్త అంశం తెరపైకి వస్తోంది! దాని చుట్టూ రాజకీయ రచ్చ రాజుకుంటోంది! లేటెస్ట్‌గా సునీల్‌యాదవ్ బెయిల్‌ను వ్యతిరేకిస్తూ సీబీఐ వేసిన కౌంటర్, టీడీపీ-వైసీపీ మధ్య మరోసారి మంటల్ని రాజేసింది. ఎవరి వర్షన్‌ను వాళ్లు చాలా బలంగా వినిపిస్తున్నారు. వివేకానందరెడ్డి హత్య జరిగి దాదాపు 4 ఏళ్లు కావస్తోంది. అప్పటి నుంచి ఈ కేసులో ఎన్నో మలుపులు. విషయం ఎప్పుడో పొలిటికల్ టర్న్ తీసుకుంది కూడా. దర్యాప్తు విషయంలో ఈ మధ్యే సీబీఐ దూకుడు పెంచింది. రోజుకో విషయం బయటకు వస్తోంది. ఇప్పుడు ఈ కేసులో నిందితుడుగా ఉన్న సునీల్ యాదవ్ కూడా బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. దీనికి కౌంటర్ పిటిషన్ వేసింది సీబీఐ. ఈ పిటిషన్‌లోని అంశాలే ఇప్పుడు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. వివేకాను ఎవరు చంపారో సీబీఐ తేల్చేసింది అంటోంది తెలుగుదేశం. ఈ లీకుల వెనుక కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ అంతా చంద్రబాబుదే అని ఆరోపిస్తోంది వైసీపీ.వివేకా హత్య చుట్టూ ఏపీ రాజకీయం నడుస్తోంది. సందర్భం వచ్చినప్పుడల్లా ఈ అంశాన్ని తెరపైకి తెస్తోంది తెలుగుదేశం. నేరుగా సీఎం జగన్‌ను టార్గెట్ చేస్తోంది. ఈ విమర్శలను పూర్తిగా ఖండిస్తోన్న వైసీపీ సూటిగా పలు ప్రశ్నలు సంధిస్తోంది. ఎన్నికల ముందు జగన్ క్యారెక్టర్‌ను బ్యాడ్ చేయడమే లక్ష్యంగా చంద్రబాబు అండ్ టీమ్ కుట్ర చేస్తోందని ఆరోపిస్తోంది. సీబీఐ కూడా చంద్రబాబు లైన్‌లోనే పనిచేస్తోందని సంచలన విమర్శలు చేస్తోంది.గూగుల్ టేకౌట్! ఈ పదం కూడా పొలిటికల్ రచ్చకు ముడిసరుకుగా మారిపోయింది. ఈ హత్య కేసు గుట్టుని టెక్నాలజీ విప్పేసిందన్నది టీడీపీ వర్షన్. టెలికాం ఆపరేటర్ కూడా ఆ పని చేస్తాడని, దానికి సీబీఐ ఎందుకని నిలదీస్తోంది వైసీపీ.వివేక హత్య కేసు కచ్చితంగా రాజకీయ ముడిసరుకుగా మారింది.! అందుకే పొలిటికల్ ఇంటరాగేషన్ నడుస్తోంది. జగన్‌ను టార్గెట్ చేస్తోంది టీడీపీ. దర్యాప్తు ఏకపక్షంగా, టీడీపీకి కావాల్సిన లైన్‌లో జరుగుతోందనే అంశాన్ని బలంగా తెరపైకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది వైసీపీ. వివేకా చుట్టూ నడుస్తున్న ఈ పొలిటికల్ యుద్ధం..భవిష్యత్‌లో మరింత రచ్చ రాజేసే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి

# కూరగాయల వాహనంలో గంజాయి, మద్యం

**తిరుమల:**

తిరుమలలో గంజాయి కలకలం రేగింది. కూరగాయల వాహనంలో గంజాయిని తరలిస్తుండగా టీటీడీ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం టీటీడీ విజిలెన్స్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు తిరుమలలోని జీఎన్సీ టోల్ గేట్ వద్ద వాహనాల తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కూరగాయల వాహనంలో దాదాపు అర కేజీ గంజాయిని టీటీడీ విజిలెన్స్ అధికారులు గుర్తించారు. దీంతో వాహనంలో ఉన్న రెడ్డి, రెహమాన్ అనే ఇద్దరు యువకులను విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. అయితే తిరుమలలోని హోటల్స్, దుకాణాలకు నిత్యం కూరగాయలు తరలిస్తుంటారు. కూరగాయల మాటున కొద్ది కాలంగా గంజాయి తరలిస్తున్నట్లు టీటీడీ విజిలెన్స్ అధికారులు గుర్తించారు. దీంతో రంగంలోకి దిగిన టీటీడీ విజిలెన్స్ అధికారులు గంజాయిని కొండపై ఎవరి అందిస్తున్నారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. తిరుమలలో ఇటీవల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు సెబ్ అధికారులు. తిరుమల ఓల్డ్ బార్బర్ క్వార్టర్స్ వద్ద 22 మద్యం బాటిల్స్ ని స్వాధీనం చేసుకున్నారు స్పెషల్ ఎన్ ఫోర్స్మెంట్ బ్యూరో సిబ్బంది. మద్యం అక్రమ రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నారు. నిందితులు సుమలత, నాగేంద్ర ప్రసాద్, బిన్నీ, ప్రవీణ్ కుమార్ వద్ద నుంచి మొత్తం 22 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీళ్లంతా అనంతపురం జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. కాంట్రాక్టు పనుల కోసం తిరుమలకు వచ్చినట్లు తెలుస్తోంది. తిరుమలలో ఇటీవల మాంసం తింటూ షికారీలు పట్టుబడ్డారు. వారిని తిరుమల విజిలెన్స్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. తిరుమలలో మద్యమాంసాలపై నిషేధం ఉన్నా కొందరు మాత్రం నియమాలను అతిక్రమిస్తున్నారు. నిబంధనలు పాటించే వారికేనని మాకు కాదంటూ కొందరు షికారీలు, స్థానికులు తరచూ తిరుమలలో మాసం మద్యం సేవిస్తూ పట్టుబడుతున్నారు. తిరుమలలోని షికారి వీధిలో కొందరు షికారీలు మాసం వండినట్లు టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. వెంటనే స్పందించిన విజిలెన్స్ సిబ్బంది ఇద్దరు షికారిలను అదుపులోకి తీసుకున్నారు. వారిని కమాండ్ కంట్రోల్ రూమ్ కు తరలించి విచారణ చేపట్టారు. తిరుమల కొండపై మద్యం, మాంసంపై నిషేధం ఉంది. కొందరు ఈ నిబంధనలను అతిక్రమిస్తున్నారు. తిరుమలలో మాంసం తింటూ మద్యం సేవిస్తూ పట్టుబడుతున్నారు. తిరుమలలోని షికారీ వీధిలో కొందరు షికారీలు మాంసం వండి తింటున్నట్టు టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.తిరుమల శ్రీవారి ఆలయాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన ఓ వీడియో ఇటీవల నెట్టింట హల్ చల్ చేసింది. ఈ వీడియో వైరల్ అవడంతో టీటీడీ అధికారులు అప్రమత్తమయ్యారు. డ్రోన్ కెమెరాల్లో శ్రీవారి ఆలయాల చిత్రీకరించిన వీడియో వైరల్ అయింది. తిరుమల శ్రీవారి ఆలయంపై, పరిసర ప్రాంతాల్లో విమానాలు, డ్రోన్ కెమెరాలు నిషేధం ఉంది. అయితే శ్రీవారి ఆలయానికి సంబంధించిన వీడియాను ఐకాన్ అనే ఓ యూట్యూబ్ ఛానల్ పోస్టు చేయడం కలకలంగా మారింది. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్‌గా మారడంపై శ్రీవారి భక్తులు, ఆగమ సలహాదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్లాది మంది ఆరాధ్య దైవంమైన శ్రీనివాసుడి దర్శనార్థం ప్రతినిత్యం లక్షలాది మంది భక్తులు దేశ విదేశాల నుండి తిరుమల పుణ్యక్షేత్రానికి వస్తుంటారు. అయితే తిరుమల కట్టుదిట్టమైన భద్రత వలయాలతో పటిష్టమైన సెక్యూరిటీ కలిగిన దేవస్థానం. ప్రతినిత్యం మాన్యువల్ సెక్యూరిటీ నుంచి మూడో కన్ను వరకు అన్ని కాపు కాస్తూనే ఉంటాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా హైసెక్యూరిటీ నడుమ టీటీడీ విజిలెన్స్, పోలీసు, ఆక్టోపస్ అంటూ వివిధ సెక్యూరిటీ ఫోర్స్ లతో పాటు సీసీ కెమెరాలు నిత్య పర్యవేక్షణలో తిరుమల సురక్షితంగా ఉంటుంది. ఇలాంటి హైసెక్యూరిటీ ప్రాంతంలో డ్రోన్ కెమెరాలు ఎగరవేయరాదనే నిబంధనలు ఉన్నాయి. ఒకవేళ అనుమతి లేకుండా డ్రోన్స్ ఎగురవేస్తే కటకటాల పాలుకావాల్సిందే. ఇక ఇప్పటికే నో ఫ్లై జోన్ గా ప్రకటించాలని టీటీడీ కేంద్ర పౌర విమానయాన శాఖను పలుమార్లు కోరింది. అయితే సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసిన పౌర విమానయాన శాఖ అధికారులు అది సాధ్యం కాదని తేల్చారు. విమానం సంగతి పక్కన బెట్టిన డ్రోన్స్ ఎగరేయరాదనే నిబంధనలు మాత్రం పటిష్ఠంగా అమలు చేస్తుంది టీటీడీ.

# ఆ లెటర్ లో ఏముంది??

**హైదరాబాద్ :**

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో రెండో సారి సీబీఐ విచారణకు హాజరైన వైఎస్ అవినాష్ రెడ్డి సీబీఐ అధికారులకు ఓ ప్రత్యేకమైన లేఖ అందించినట్లుగా తెలుస్తోంది. వివేకా హత్య కేసులో తనకు తెలిసిన సమాచారంతో పాటు తనకు ఉన్న సందేహాలను అందులో పేర్కొన్నానని అవినాష్ రెడ్డి చెబుతున్నారు. హత్య కేసులో తనకు తెలిసిన సమాచారం ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాను చెప్పాలనుకున్నది సీబీఐకి చెప్పవచ్చు కదా.. ప్రత్యేకంగా లేఖ ఇవ్వడం ఎందుకన్నది కూడా ఆసక్తి రే?పతోంది. విచారణ తర్వాత మీడియాతో మాట్లాడిన అవినాష్ రెడ్డి సీబీఐ తీరుపై చాలా అనుమానాలు వ్యక్తం చేశారు. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌తో పాటు సీబీఐ డైరక్టర్‌కూ లేఖ రాశానని అవినాష్ రెడ్డి మీడియాకు చెప్పారు. సీబీఐ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చానని.. విచారణ సమయంలో ఆడియో, వీడియో రికార్డ్ చేయాలని కోరాను , కానీ రికార్డ్ చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వివేకా హత్య కేసు రోజు మీడియా తో మొట్ట మొదట గా మాట్లాడింది తానేనన్నారు. ఆ రోజు ఇచ్చిన స్టేట్మెంట్ కు కట్టుబడి ఉన్నానని.. ఇప్పుడు కేసు విచారణ వ్యక్తి టార్గెట్ గా నడుస్తుందన్నారు. మొదటి సారి విచారణ కు వచ్చినప్పుడు మరో సారి రావాలని చెప్పారు కానీ ఇప్పుడు విచారణ ముగిసిన తరువాత మరోసారి విచారణకు రావాలని ఏమి చెప్పలేదని అవినాష్ రెడ్డి మీడియాకుచెప్పారు. వివేకా హత్య కు సంబంధించి నా దగ్గర ఉన్న సమాచారాన్ని ఇచ్చాను ...మీడియాలో వస్తున్న కథనాలతో సీబీఐ విచారణ పై ప్రభావం పడుతోందన్నారు. తనకు 160సీఆర్పీసి కింద ఇచ్చిన నోటీస్ ఇచ్చారని.. తనను సాక్షిగా విచారిస్తున్నారో, నేరస్తుడిగా విచారిస్తున్నారా తెలీదని చెప్పుకొచ్చారు. టిడిపి సంవత్సరం కింద చెప్పిన అంశంలనే సి బి ఐ కౌంటర్ లో చెప్పిందన్నారు. వివేక మర్డర్ జరిగిన రోజు దొరికిన లెటర్ ఎందుకు దాస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఆ లేఖ ను బయటికి తీసుకురావాలని కోరుతున్నానని మీడియాకు చెప్పారు. తన విచారణలో ఎక్కడ ఆడియో వీడియో రికార్డింగ్ లేదని.. న్యాయవాదులను అనుమతించాలని కోరాను అందుకు సిబిఐ ఒప్పుకోలేదని ఆయన చెబుతున్నారు. సీబీఐ అధికారులు చెబుతున్న గూగుల్ టెక్ ఔట్ .. టీడీపీ టెక్ ఔట్ అయి ఉంటుందని అసహనం వ్యక్తం చేశారు. విచారణ పూర్తిగా ఏక పక్షంగా జరుగుతోందన్నారు. గత విచారణలో కాల్ డేటా ఆధారంగా విచారణ జరిపారు. ఆ సమయంలో సీఎం జగన్, ఆయన సతీమణి భారతిల పీఏలకు ఫోన్ చేసినట్లుగా తెలిపారు. దీంతో వారినీ సీబీఐ విచారించింది. శుక్రవారం నాటి విచారణలో బ్యాంక్ లావా దేవీలపై సీబీఐ అధికారులు ఆరా తీస్తున్నట్లుగా తెలుస్తోంది. దస్తగిరి ఇచ్చిన కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌ను ప్రస్తావిస్తూ అవినాష్‌ను విచారిస్తున్నరని అంటున్నారు. వివేకా హత్యకేసులో అవినాష్ పాత్ర కీలకంగా ఉందని సీబీఐ భావిస్తోంది. ఇప్పటికే తెలంగాణ హైకోర్టులో ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది.

# ఏపీలో కమలం దారెటు...

## పొత్తులపై తేల్చని అధిష్టానం

**విజయవాడ :**

తెలుగుదేశం పార్టీతో పొత్తు విషయంలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) పెద్దలు ఓ క్లారిటీకి వచ్చేసినట్టేనా? ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలన్నీ అలాగే కనిపిస్తున్నాయి. కమలనాథులతో పొత్తు ఆశిస్తున్న తెలుగుదేశం పార్టీకి నిరాశే ఎదురవుతోంది. పొత్తులు, కూటములు వంటి అంశాలు సాధారణంగా ఎన్నికల వేళ చర్చకొస్తాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లో పొత్తుల రాజకీయాలు చాలా ముందే మొదలయ్యాయి. 2020లోనే బీజేపీ-జనసేన కలిసి కూటమిగా ఏర్పడగా.. ఆ రెండు పార్టీలు తమతో కలవాల్సిందిగా తెలుగుదేశం పార్టీ సైతం చాలాకాలంగా కోరుతూ వస్తోంది. విడివిడిగా పోటీ చేస్తే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోయి, అంతిమంగా అది వైఎస్సార్సీపీకే మేలు చేస్తుందని చెబుతోంది. 2014 మాదిరిగా తెలుగుదేశం-బీజేపీ-జనసేన కూటమి కలిసి పోటీ చేస్తే మళ్లీ అధికారం సాధించవచ్చని గుర్తుచేస్తోంది. ఈ ప్రతిపాదనలకు జనసేన కాస్త మెత్తబడినట్టు కనిపిస్తున్నా? బీజేపీ మాత్రం ఏ కోశానా మెత్తబడ్డ సంకేతాలు ఇవ్వలేదు. ఏమాత్రం ఊగిసలాటను కూడా ఎన్నడూ ప్రదర్శించలేదు. పైపెచ్చు.. హస్తిన నుంచి అధిష్టానం పెద్దలు పార్టీ గెలిచినా, గెలవకున్నా.. టీడీపీతో మాత్రం పొత్తు ప్రసక్తి ఉండదనే చెబుతూ వచ్చారు. అయినప్పటికీ తెలుగుదేశం పార్టీలో ఏ మూలనో ఆశలు సజీవంగానే ఉన్నాయి. కమలనాథులు ఇప్పటికిప్పుడు మెత్తబడకపోయినా.. ఎన్నికలు సమీపించిన తర్వాత ఒకే చేస్తారన్న ఆశతో ఉంది. కానీ తాజా పరిణామాలు చూస్తుంటే.. ఇక ఆశలు వదులుకోక తప్పదని అర్థమవుతోంది. ఎన్డీయేను వీడి వెళ్లే క్రమంలో నాటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు వ్యవహరించి తీరును మోదీ-షా నాయకత్వం ఇప్పటికీ మర్చిపోలేకపోతోందని ఆ పార్టీ నేతలు చెబుతుంటారు.రాజకీయాల్లో ఏ పార్టీతోనైనా పొత్తులు పెట్టుకోవాలంటే ఆ పార్టీ బలాబలాలను బేరీజు వేసుకుంటారు. పొత్తుతో తమకు ఏం కలిసొస్తుంది? ఎంత మేర ఓట్లు అదనంగా వచ్చి చేరతాయన్న లెక్కలు వేసుకుంటారు. కనీసం 5% ఓటు బ్యాంకు ఉన్నా సరే.. పొత్తు పెట్టుకుంటే ఆ ఓటుబ్యాంకు కలిసి మొత్తం ఫలితాలనే తారుమారు చేయవచ్చని భావిస్తుంటారు. ఈ సూత్రం ప్రకారం 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 5.53% ఓట్లు సాధించిన జనసేనతో తెలుగుదేశం పార్టీ పొత్తు కోరుకోవడం తప్పేమీ కాదు. ఆ ఎన్నికల్లో దాదాపు 50% ఓటుబ్యాంకును కైవసం చేసుకున్న వైఎస్సార్సీపీని దెబ్బకొట్టాలంటే మిగతా ఓటుబ్యాంకు అంతా ఒక్కచోటకు చేర్చక తప్పదు. తెలుగుదేశం పార్టీ సరిగ్గా అదే వ్యూహంతో అడుగులు వేస్తోంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ కనీసం 1% కూడా ఓటుబ్యాంకు లేని స్థితిలో ఉంది. జాతీయస్థాయిలో ప్రధాని మోదీ హవాతో రెండోసారి మరిన్ని ఎక్కువ సీట్లు సాధించి ఘనవిజయం సాధిస్తే.. ఆంధ్రప్రదేశ్ నుంచి గతంలో గెలుచుకున్న ఎంపీ సీట్లను కూడా నిలబెట్టుకోలేకపోయింది. అంటే.. కనీసం ఉనికి కూడా చాటుకోలేకపోయింది. అలాంటి పార్టీతో పొత్తు కోసం వెంపర్లాడడం ఎవరికైనా ఆశ్చర్యం కల్గించే అంశమే. బీజేపీ చేతులు కలిపితే వచ్చి చేరే అదనపు ఓటుబ్యాంకు సంగతి ఎలా ఉన్నా.. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కాబట్టి కూటమి నైతిక స్థైర్యం పెరుగుతుంది. ఇది తప్ప మరో బలమైన కారణమేదీ కనిపించడం లేదు.అయినప్పటికీ బీజేపీతో పొత్తు కోసం తెలుగుదేశం తన ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంది. ఇంటా, బయటా ఒత్తిడి పెంచుతోంది. తెలంగాణలోనూ తెలుగుదేశం ఓటుబ్యాంకు బీజేపీకి అదనపు బలంగా మారుతుంది అంటూ ఖమ్మంలో భారీ సభ నిర్వహించి మరీ సంకేతాలు పంపించింది. అయితే తెలంగాణ బీజేపీ మాత్రం టీడీపీతో చెలిమి లాభం కంటే ఎక్కువ నష్టమే కల్గిస్తుందని అధిష్టానం పెద్దలకు చెప్పి, ఒంటరిగానే పోటీ చేయడానికి సిద్ధమైంది. ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీతో పొత్తు కోరుకుంటున్న కొందరు బీజేపీ నేతలు తమ అధిష్టానంపై ఒత్తిడి పెంచుతూ వచ్చారు. టీడీపీతో పొత్తు లేకపోతే 2019 ఫలితాలే పునరావృతమవుతాయని, పొత్తుంటే గౌరవప్రదమైన సీట్లు పొందవచ్చని ప్రతిపాదించారు. వీలున్న ప్రతిసారీ ఈ విషయాన్ని చెబుతూనే ఉన్నారు. అయినా సరే, అధిష్టానంలో కదలిక లేదు.ఒకప్పుడు వైఎస్సార్సీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్న కన్నా లక్ష్మీనారాయణను ఆపి, తమ పార్టీలోకి తీసుకొచ్చి, రాష్ట్ర అధ్యక్ష పీఠాన్ని కట్టబెట్టిన కాషాయదళం.. అదే వ్యక్తి ఇప్పుడు పార్టీని వీడి వెళ్తానని హెచ్చరించినా సరే పట్టించుకోలేదు. కనీసం ఆపే ప్రయత్నం కూడా చేయలేదు. కన్నా వెళ్తూ.. వెళ్తూ తనతో పాటు తన వర్గం నేతలనూ తీసుకెళ్లారు. సరిగ్గా అదే రోజు ఓ పాతిక మంది ఏపీ బీజేపీ నేతలు ఢిల్లీకి చేరుకుని రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మురళీధరన్‌ను కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వ్యవహారశైలి కారణంగానే నేతలు పార్టీ వీడి వెళ్తున్నారని, ఆయనుంటే పార్టీ మరింత నష్టపోతుందని తేల్చి చెప్పారు. అయితే ఈ నేతల బృందం రాక గురించి, వారు చెప్పబోయే అంశాల గురించి ముందే తెలిసినట్టుగా మురళీధరన్ వ్యవహరించడంతో వారంతా షాక్ అయ్యారు. భేటీ పూర్తయ్యాక బయటికొస్తూ నేతలు తమలో తాము మాట్లాడుకుంటూ "ప్చ్.. వచ్చి ఉపయోగం లేకపోయింది. మనం చెప్పేది వినే ధోరణిలో ఆయన లేడు" అని పెదవి విరిచారు. ఇంతమంది ఎందుకొచ్చారంటూ మందలించినట్టుగానూ వారు మీడియాతో చెప్పారు. అంత దూరం ప్రయాసపడి మరీ వచ్చి కలిస్తే.. నిలబడే మాట్లాడారని, కొన్ని నిమిషాలే కేటాయించారని మరికొందరు నేతలు అసంతృప్తి వెలిబుచ్చారు. పొరుగునే ఉన్న తెలంగాణలో కమలదళం పోరాటపటిమను ప్రదర్శిస్తూ దూసుకెళ్తుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ నాయకత్వం ఏ సమస్యపైనా పోరాటం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే రాష్ట్ర నాయకత్వంలో కొందరు వైఎస్సార్సీపీకి అనుకూలంగా, కోవర్టులుగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. కానీ అధిష్టానం మాత్రం వచ్చిన నేతలందరూ తెలుగుదేశంతో పొత్తు కోరుకునే వర్గానికి చెందినవారని, వారు చెప్పే విషయాలకు అంతగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని భావిస్తున్నట్టు తెలిసింది. సోము వీర్రాజును తొలగించాలా.. కొనసాగించాలా అన్నది అధిష్టానం నిర్ణయమని, క్రమశిక్షణ కల్గిన పార్టీ కార్యకర్తల బాధ్యత అధిష్టానం ఆదేశాలను అమలు చేయడమేనని మురళీధరన్ తేల్చి చెప్పినట్టు సమాచారం. మొత్తంగా అధిష్టానం తీరుతో బీజేపీలో టీడీపీ పొత్తు కోరుకుంటున్న వర్గానికి క్లారిటీ వచ్చినట్టే కనిపిస్తోంది.

# మంగమ్మ ఎన్నిక ఏకగ్రీవం

**అనంతపురం:**



నామినేషన్ ప్రక్రియ ఇంకా పూర్తి కాక ముందే వైసీపీ ఓ విజయం నమోదు చేసుకుంది. ఎన్నికలు జరగకుండానే ఓ స్థానాన్ని తమ ఖాతాలో వేసుకంది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైసీపీ ఓ స్థానాన్ని ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన ఎస్ మంగమ్మ ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆమెను ఖరారు చేశారు. అనంతపురం జిల్లాలో నిన్నటి వరకు నిన్నటి వరకు నామినేషన్లు స్వీకరించారు. వచ్చిన నామినేషన్లను స్క్రూటినీ చేశారు. వాటిలో చాలా నామినేషన్లను సరైన వివరాలు లేవని తిరస్కరించారు. అలా తిరస్కరించిన వాటిలో టీడీపీ లీడర్ నామినేషన్ కూడా ఉంది. సరైన వివరాలు ఇవ్వలేదన్న కారణంతో టీడీపీ అభ్యర్థి వేలూరు రంగయ్యసహా పలువురు నామినేషన్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. నామినేషన్ల పరిశీలన తర్వాత ఒక్క మంగమ్మ నామినేషన్ మాత్రమే మిగిలింది. ఎన్నికల సంఘం చెప్పిన రూల్స్ ప్రకారం ఉన్న ఆ ఒక్క నామినేషన్‌ను మాత్రమే అధికారులు అంగీకరించారు. దీంతో పోటీగా అభ్యర్థులు లేకపోవడంతో ఆమె ఎన్నికల లాంఛనం కానుంది. ప్రక్రియ పూర్తైన తర్వాత మంగమ్మ ఎన్నికను అధికారులు ప్రకటించనున్నారు. మరోవైపు నామినేషన్ల తిరస్కరణకు గురైన అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా టీడీపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కర ణకు గురికావడాన్ని ఆ పార్టీ లీడర్లు తప్పుబ డుతున్నారు. కావాలనే అధికారులు నామినేషన్లు తిరస్కరించారని ఆరోపిస్తున్నారు. అధికారుల తీరుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామంటున్నారు టీడీపీ అభ్యర్థి రంగయ్య.

# బిజెపి ప్రభుత్వం పేదలకు ఎంతో వరం

**నాగర్ కర్నూల్**

బల్మూరు మండలం చెన్నారం గ్రామంలో శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్ శనివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్నర్ మీటింగ్ కు ముఖ్య అతిథిగా బిజెపి అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు శ్రీకాంత్ బీమా రావడం జరిగింది. శ్రీకాంత్ భీమా మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక రకాల పథకాలను ప్రవేశపెట్టడం జరిగింది. పేదలకు ముఖ్యంగా ఆరోగ్యపరంగా ఎంతగానో ఉపయోగపడే ఆయుష్మాన్ భారత్ పథకం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందకుండా చేస్తుందని, అదేవిధంగా జీవిత బీమా పథకాలు కూడా చాలా ఉన్నప్పటికీ వాటిని ప్రచారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనదని శ్రీకాంత్ చెప్పడం జరిగింది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రవేశపెట్టిన పథకాలను కూడా ప్రజలకు అందించడంలో జాప్యం చేస్తూ విఫలమైనదని శ్రీకాంత్ భీమ చెప్పడం జరిగింది. ఈ కార్నర్ మీటింగ్ సమావేశానికి రాష్ట్ర మైనారిటీ మోర్చా




నాయకులు హమీద్ , బీజేవైఎం అచ్చంపేట అసెంబ్లీ కో కన్వీనర్ నోముల బాలకృష్ణ యాదవ్ , శక్తి కేంద్ర ఇన్చార్జ్ ఆకునమోని మల్లేష్ , బూత్ అధ్యక్షులు అల్లోజి, కే మల్లేష్, అశోక్ రెడ్డి, మరియు బిజెపి కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**కాకినాడ**



గొల్లప్రోలు మండలం చేబ్రోలు హైవేపై తాడిపర్తి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతం లో చేబ్రోలు గ్రామం నుండి హైవే మీదుగా దర్శనానికి వెళ్తున్న భక్తులపై గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే ఒకరు మృతి చెందారు. ఇంకొక రు తీవ్ర గాయాలయ్యారు. బాధితులు చేబ్రోలు గ్రామానికి చెందిన వారు గా గొల్లప్రోలు పోలీసులు గుర్తించారు. కత్తిపూడి నుండి సుమారు మూడు నలభై ప్రాంతంలో కాకినాడ వెళుతున్న గుర్తుతెలియని లారీ ఆడవారిపై అత్యంత వేగంగా దూసుకుంటూ ఆగకుండా వెళ్ళిపోయింది. మృతురాలు గాజుల శివగంగ (25) . పిఠాపురం సిఐ వైఆర్కే రామకృష్ణకేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## ఎంట్రన్స్ టెస్ట్ ఫీజు రూ. 100 భారం

**హైదరాబాద్**

తెలంగాణలో ఉద్యోగాలు, ప్రవేశ పరీక్షల కోసం నోటిఫికేషన్లు రిలీజ్ అవుతూనే ఉన్నాయి. అర్హత కలిగిన అభ్యర్థులు.. దరఖాస్తులు కూడా చేసుకుంటున్నారు. అయితే.. ఇక్కడే విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోంది. ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న అన్ని ప్రవేశ పరీక్షల ఫీజులు ఈ సారి అమాంతం పెరిగాయి. గతేడాదితో పోలిచే ప్రతి పరీక్షకు రూ.100 పెంచారు. ఎంసెట్‌కు గతేడాది ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగ విద్యార్థులకు రూ.400 ఉంటే.. ఈసారి రూ.500కు, ఇతరులకు రూ.800 నుంచి రూ.900కు పెంచారు. పీజీఈసెట్ రుసుము ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగ విద్యార్థులకు రూ.500 నుంచి రూ.600కు, ఇతరులకు రూ.1000 నుంచి రూ.1100కు చేరాయి. ఎడ్‌సెట్, ఐసెట్, లాసెట్, పీఈసెట్, ఈసెట్‌లకూ పెంచనున్నారు. ఈ ఆరు పరీక్షలకు పెంచిన ఫీజులతో విద్యార్థులపై రూ.4.50 కోట్ల భారం పడే అవకాశముంది.మరోవైపు.. తెలంగాణ ఎంసెట్ షెడ్యూల్ విడుదలయ్యింది. ఫిబ్రవరి 28న నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 3 నుంచి ఆన్‌లైన్ అప్లికేషన్స్ స్వీకరణ ఉంటుంది. ఆన్‌లైన్ అప్లికేషన్ స్వీకరణకి చివరి తేదీ ఏప్రిల్ 10గా నిర్ణయించారు. ఏప్రిల్ 12 నుండి 14వ తేదీవరకు ఎడిట్ చేసుకునే అవకాశం ఉంది. 250 రూపాయల లేట్ ఫీజుతో ఏప్రిల్ 15 వరకు అప్లై చేసుకోవచ్చుమే 7,8, 9 తేదీల్లో ఇంజనీరింగ్ పరీక్షలు జరగనున్నాయి. మే 10, 11న అగ్రికల్చర్ అండ్ మెడికల్ పరీక్ష జరగనుంది ఫిబ్రవరి నెల 28 న పీజీఈసెట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 3 నుంచి ఏప్రిల్?30 వరకు పీజీఈసెట్?కు అప్లికేషన్స్ స్వీకరించనున్నారు. లేటు ఫీజుతో మే 24 వరకు పీజీఈసెట్ దరఖాస్తుల స్వీకరిస్తారు.

## సాఫ్ట్‌వేర్ సాయంతో బీపీ, షుగర్, రిపోర్ట్

**హైదరాబాద్:**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాబోయే రోజుల్లో థర్మల్ స్క్రీనింగ్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేయవచ్చు. అంతే కాకుండా ముఖం చూసే బీపీ, షుగర్ ఎంతుందో చెప్పేసే రోజులు వస్తాయని ప్రముఖ డయాగ్నొస్టిక్ సెంటర్ ఆర్కా ల్యాబ్ సీఈవో గాయత్రి తెలిపారు. ఇకపై శరీరానికి సూది గుచ్చకుండా, రక్తపు బొట్టు బయటకు రాకుండా వ్యాధి ఎంటో నిర్ధారణ చేయవచ్చన్నారు. ఇలాంటి నూతన టెక్నాలజీ హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చింది. థర్మల్ స్క్రీనింగ్ డివైజ్ పరికరంతో రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులను సులువుగా గుర్తించవచ్చని సీఈవో గాయత్రి తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో డివైజ్ తయారీ, వీటి వినియోగానికి అవసరమైన సాంకేతికతను బెంగళూరు కేంద్రంగా అందిస్తున్నట్టు చెప్పారు.నిల్చున్న చోటే ముఖ కదలికలను కెమెరా రికార్డు చేసి వాటిని ఎనలైజ్ చేసేందుకు రూపొందించిన సాఫ్ట్‌వేర్ సాయంతో బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులను గుర్తించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని కిమ్స్‌తోపాటు మరికొన్ని సెంటర్లు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు క్లినిక్‌ల ద్వారా ఈ సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 4వేల మందికి థర్మల్ స్క్రీనింగ్ ద్వారా వైద్య పరీక్షలు చేయగా 91 శాతం కచ్చితమైన ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ నూతన డివైజ్ ద్వారా రూ.100-150 లోపే హెల్త్ రిపోర్టు పొందవచ్చని ఆమె తెలిపారు.

## సైనిక్ స్కూల్ కు ఎంపికైన మానస విద్యార్థులు

**జగిత్యాల,**

అల్ ఇండియా స్థాయిలో జరిగిన సైనిక్ స్కూల్ అర్హత పరీక్షలో మానస స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రజితా రావు పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో అల్ ఇండియా స్థాయిలో సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్ష జరిగిందని ఇందులో వేలాది మంది విద్యార్థులు సీటు కోసం గతనేల అర్హత పరీక్ష రాశారన్నారు. మానస స్కూల్ నుంచి మ్యాకల సుహాన్ (261/300), రాగిల్ల విశ్వతేజ (256/300) రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి ఇది జగిత్యాల జిల్లాలో ప్రభంజనం రజితా రావు పేర్కొన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చిన మ్యాకల సుహాన్, రాగిల్ల విశ్వతేజలను ప్రిన్సిపాల్ రజితా రావు, డైరెక్టర్లు బి.శ్రీధర్ రావు, బి.హరిచరన్ రావు, జే. మౌనికా రావు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# రాజకీయాలకు యడ్యురప్ప గుడ్ బై

**బెంగళూరు :**



కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడియూరప్ప రాజకీయాల నుంచి రిటైర్ అవుతున్నట్టు ప్రకటించారు. అసెంబ్లీలో ప్రసంగించిన ఆయన ఈ విషయం వెల్లడించారు. ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండనని స్పష్టం చేశారు. "రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నాను. కానీ బీజేపీ గెలుపు కోసం నా ఊపిరున్నంత వరకూ పని చేస్తాను. బీజేపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలన్నదే నా లక్ష్యం. ఇది కచ్చితంగా జరిగి తీరుతుందని నమ్ముతున్నానని తెలిపారు. కర్ణాటకలో బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాల్లోనే యడియూరప్ప చివరిసారి ప్రసంగించి ఈ నిర్ణయం ప్రకటించారు. అయితే...అంతకు ముందే ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో పోటీ చేయనని ముందే చెప్పానని, కానీ పార్టీ కోసం కచ్చితంగా పని చేస్తానని అన్నారు. ఇప్పుడు అసెంబ్లీలో అధికారికంగా ఈ విషయం చెప్పారు. ఫేర్‌వెల్ స్పీచ్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 1988 నుంచే కర్ణాటక బీజేపీలో కీలక పాత్ర పోషిస్తున్నారు యడియూరప్ప. అప్పటికే ఆయన పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. "చాలా సందర్భాల్లో ప్రతిపక్షాలు పదేపదే విమర్శించాయి. బీజేపీ నన్ను పక్కన పెట్టేసిందని అన్నాయి. వారందరికీ ఇప్పుడు నేను చెప్పేది ఒకటే. నేను నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాను. ఇలాంటి అవకాశం మరే నేతకూ దక్కలేదు. ఇందుకు ప్రధాని నరేంద్ర మోదీకి నేనెప్పటికీ రుణపడి ఉంటాను" యడియూరప్ప ప్రసంగంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఆయన మాట్లాడారని కొనియాడారు. ట్విటర్‌లో కన్నడలో ట్వీట్ చేశారు. "ఓ బీజేపీ కార్యకర్తగా ఈ ప్రసంగాన్ని విన్నాను. నాకెంతో స్ఫూర్తినిచ్చింది. మా పార్టీ సిద్ధాంతాలు, విలువులను ఈ ప్రసంగం ప్రతిబింబించింది. మిగతా పార్టీ కార్యకర్తలకూ ఇది స్ఫూర్తినిస్తుందని విశ్వసిస్తున్నానని మోడీ వ్యాఖ్యానించారు. కాగా దశాబ్దాల పాటు బీజేపీకి సేవలందించిన యడియూరప్ప.. కర్ణాటక అసెంబ్లీలో శిఖారిపుర నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఎన్నికల రాజకీయాలకు మాత్రమే తాను దూరమవుతానని.. బీజేపీకి బతికున్నంత కాలం సేవలు చేస్తానని అన్నారు యడియూరప్ప. బీజేపీ తనను పక్కన పెట్టిందన్న వార్తల్లో నిజం లేదన్నారు యడియూరప్ప., కర్ణాటక రాజకీయాల్లో యడియూరప్ప పేరు ఓ సంచలనం. ముఖ్యమంత్రి పని చేసిన యడియూరప్పపై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఆయన రెండు సార్లు ముఖ్యమంత్రి పీఠం నుంచి దిగాల్సి వచ్చింది. ఇక ప్రస్తుతం ఆయన వారసులు రాజకీయాల్లో రాణిస్తున్నారు.ఇదిలాఉంటే.. మరికొద్ది రోజుల్లో కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఇలాంటి తరుణంలో యడియూరప్ప రాజకీయాల నుంచి తప్పుకోవడంతో రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. బీజేపీ ఆయన్ను పక్కన పెట్టిన కారణంగానే యడియూరప్ప ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. యడియూరప్ప నిర్ణయం బీజేపీకి గట్టి షాకే అని అంతా భావిస్తున్నారు. మరి ఆయన నిర్ణయం కమలం పార్టీపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి.

# ఆగని... ఆదానీ బ్లడ్ బాత్....

**ముంబై:**



అదానీ గ్రూప్ మీద హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వేసిన బాంబ్ షెల్ వేడికి, కేవలం ఒక నెల రోజుల్లోనే ఇన్వెస్టర్ల సంపద రూ. 12 లక్షల కోట్లు ఆవిరైంది. అదానీ స్టాక్స్ వాటి 52 వారాల గరిష్ట స్థాయుల నుంచి 84% వరకు పడిపోయాయి. అదానీ గ్రూప్‌లోని మొత్తం 10 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్క నెలలో 62% తగ్గి రూ. 7.32 లక్షల కోట్లకు దిగి వచ్చింది.2023 జనవరి 24న నివేదిక విడుదలైనప్పుడు, గౌతమ్ అదానీ ప్రపంచంలోనే మూడో అత్యంత సంపన్నుడిగా ఉన్నారు. అదానీ గ్రూప్ కంపెనీల స్టాక్స్‌లో పతనం ఫలితంగా ఆయన వ్యక్తిగత సంపద కూడా హరించుకుపోయి, ఇప్పుడు 29వ స్థానానికి పడిపోయారు.షేర్లను విడి డివిడిగా చూస్తే అదానీ గ్రీన్ ఎనర్జీ స్క్రిప్ తన 52 వారాల గరిష్ట స్థాయి నుంచి 84% పడిపోయి, మొత్తం గ్రూప్‌లో పరమ చెత్త పనితీరును ప్రదర్శించింది. 5% నష్టంతో, రూ. 486.75 వద్ద లోయర్ సర్క్యూట్ పరిమితిలో ఆగిపోయింది. ఇది ఒక సంవత్సరం (52 వారాల) కొత్త కనిష్ట స్థాయి కూడా. అదానీ ట్రాన్స్‌మిషన్ కూడా తన ఒక సంవత్సర గరిష్ట స్థాయి నుంచి 83%, అదానీ టోటల్ గ్యాస్ షేర్లు ఒక సంవత్సర గరిష్ట స్థాయి నుంచి 81% తగ్గాయి. ఇవాళ ఈ రెండు స్క్రిప్‌లు 5% లోయర్ సర్క్యూట్‌లలో లాక్ అయ్యాయి.స్టాక్‌లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో రూ. 20,000 కోట్ల ఈఖాని ఉపసంహరించున్న గ్రూప్ ఫ్లాగ్‌షిప్ ఎంటిటీ అదానీ ఎంటర్‌ప్రైజెస్, తన 52 వారాల గరిష్ట స్థాయి విలువలో ఇప్పటి వరకు 67% కోల్పోయింది.గ్రూప్ క్యాష్ కౌ అయిన అదానీ పోర్ట్స్ షేర్లు కూడా 52 వారాల గరిష్ట స్థాయి నుంచి 43% నష్టపోయాయి. ఈ రోజు మాత్రం 1% పెరిగి రూ. 559 వద్ద ట్రేడవుతున్నాయి.ఈ నెల రోజుల్లో హిండెన్‌బర్గ్ నివేదిక సృష్టించిన రగడ అంతా ఇంతా కాదు. ఈ విషయం మీద చర్చకు విపక్షాల పట్టుతో పార్లమెంటు మార్మోగి పోయింది. సుప్రీంకోర్టులోనూ చాలా కేసులు నమోదయ్యాయి, ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది.అదానీ గ్రూప్ స్టాక్స్ పతనం నేపథ్యంలో, మార్కెట్ అస్థిరత నుంచి పెట్టుబడిదార్ల ప్రయోజనాలను పరిరక్షించడానికి, రెగ్యులేటరీ విధానాలను బలోపేతం చేయడానికి ఒక నిపుణుల కమిటీని తామే ఏర్పాటు చేస్తామని సాక్షాత్తు సుప్రీంకోర్టు ప్రకటించింది.బద్ధలైన అగ్నిపర్వతాన్ని శాంతింపజేయడానికి అదానీ గ్రూప్ కూడా ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా... అదానీ గ్రూప్ కొన్ని రుణాలను ముందస్తుగా చెల్లించింది. కంపెనీల బ్యాలెన్స్ షీట్, బిజినెస్ మోడల్స్‌లో బలం గురించి వీలైనప్పుడల్లా మాట్లాడుతూ, ఇన్వెస్టర్ల బీపీని కంట్రోల్ చేయడానికి ప్రయత్నిస్తోంది. గౌతమ్ అదానీ కూడా రంగంలోకి దిగి తన వంతు ప్రయత్నం చేశారు. అయితే, పెట్టుబడిదార్లకు అదానీ గ్రూప్ మీద నమ్మకం కనిపించడం లేదని పడిపోతున్న షేర్ ధరలు నిరూపిస్తున్నాయి. పడిపోతున్న కత్తుల్లాంటి అదానీ స్టాక్స్‌ను పట్టుకున్న ఇన్వెస్టర్లు కూడా తమ చేతులకు తీవ్ర గాయాలు చేసుకున్నారు.గత నెల రోజుల్లో నిఫ్టీ 3% పైగా పతనమైంది. ఈ పాపంలో అదానీ సంక్షోభం కూడా ఒక కారణంగా మారింది. అదానీ కంపెనీలకు బ్యాంకులు అప్పులు ఇచ్చిన ఫలితంగా, నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ గత నెల రోజుల్లో 6% పైగా నష్టపోయింది. బ్యాంకింగ్ వ్యవస్థపై బ్రోకరేజీలు, ఎనలిస్ట్‌లు సానుకూలంగా ఉన్నా ఇన్వెస్టర్లను భయం వదిలిపెట్టలేదు.

# ప్రీతీ సూసైడ్ కేసు....పొలిటికల్ కలర్...

**వరంగల్ :**



రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వరంగల్ మెడికో ప్రీతి ఆత్మహత్యాయత్నం కేసులో రాజకీయ పార్టీలు ఎంట్రీ ఇచ్చాయి. పరామర్శల పేరుతో రంగంలో దిగిన నాయకులు.. ఒక్కక్కరు ఒక్కో కోణం ఆవిష్కరిస్తున్నారు. లవ్ జీహాద్ కలర్ కూడా అంటించారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్. లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదంటూ బీజేపీ నేతలకు బీఆర్ఎస్ మంత్రి ఎర్రబెల్లి కౌంటర్ కూడా ఇచ్చారు. ఇదిలా ఉంటే ఇదే వ్యవహారంలో విద్యార్థులు రెండు వర్గాలు విడిపోవడం ఆసక్తిగా మారింది. హైదరాబాద్ నిమ్స్‌లో మెడికో స్టూడెంట్ ప్రీతికి చికిత్స కొనసాగుతోంది. నిన్నటితో పోలిస్తే ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని డాక్టర్లు చెప్పడం కుటుంబసభ్యులకి ఊరటనిస్తోంది.ప్రీతి ఆత్మహత్యాయత్నం కేసులో అన్నీ సాక్ష్యాలను సేకరించామన్న వరంగల్ సీపీ రంగనాథ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ సైఫ్‌ను అరెస్టు చేశామన్నారు. ఉద్దేశపూర్వకంగానే ప్రీతిని సైఫ్ వేధించాడన్నారు సీపీ. దీనికి సంబంధించిన వాట్సప్ డేటాను రీట్రీవ్ చేశారు. ర్యాగింగ్ చట్టం కింద చేపడుతున్నామన్నారు కమిషనర్.. ప్రీతిని సైఫ్ వేధించిన సంఘటనలు రెండు మూడు జరిగినట్టు గుర్తించామన్నారు. అటు ప్రీతి సూసైడ్ ఎపిసోడ్ రాజకీయ రంగు పులుముకుంది. ఈ ఘటనలో ర్యాగింగ్‌తో పాటు లవ్ జిహాద్ కూడా ఉందన్నారు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్. హిందూ అమ్మాయిలను టార్గెట్ చేసి వేధిస్తున్నారని ఆరోపించారు. లవ్ జిహాద్ ఆరోపణలు ఖండించారు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. అదంతా తప్పుడు ప్రచారమని కొట్టిపడేశారు. తప్పుగా మాట్లాడితే సహించేది లేదన్నారు మంత్రి. రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్న ఈ కేసులో వరంగల్ లో విద్యార్థులు కూడా రెండు వర్గాలుగా విడిపోయారు. సైఫ్ అరెస్ట్‌ను తప్పుబడుతూ సమ్మె నోటీసు ఇచ్చారు కొందరు విద్యార్థులు. ఎంజీఎం మెయిన్ గేట్ దగ్గర ఆందోళన దిగారు. ప్రీతి ఆత్మహత్యయత్నం వ్యవహారంలో ఎవరి కోణం వారిదే? చావుతో పోరాడుతున్న సమయంలో స్వాంతన ఇవ్వాలని పార్టీలు, ప్రముఖులు దీనిని కూడా రాజకీయంగా వాడుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## వివాహితపై అత్త భర్త హత్యాయత్నం

**మైలవరం**

మైలవరం మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన గుంజ మాధవి (25) పై భర్త శీను మరియు అత్త సులోచన కలిసి కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేసారు. బాధితురాలు నిద్రిస్తున్న సమయంలో 12 గంటలకు అత్త భర్తలు కలిసి మాధవిని హతమర్చే ప్రయత్నం చేయగా ఇరుగుపొరుగువారు గమనించి వారిని అడ్డుకున్నారు. రక్తపు మడుగులో ఉన్న మాధవిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త మైలవరం పోలీస్ స్టేషన్ నందు లొంగిపోయినట్లు సమాచారం.

## దాచేపల్లిలో దారుణ హత్య

**పల్నాడు**

దాచేపల్లి లో ఒక వ్యక్తిని (45) గొడ్డలితో ముక్కలు ముక్కలుగా నరికి హత్య చేసిన ఘటన చోటు చేసుకుంది. హత్య తరువాత మృతదేహాన్ని మిర్చి తోటలో పూర్తిగా దగ్ధం చేసాడు. వివాహేతర సంబంధ నేపథ్యంలోనే హత్య జరిగినట్టు పోలీసులు, స్థానికులు అనుమానిస్తున్నారు. మృతుడు కోటేశ్వరరావు (45) గా గుర్తించారు. కోటేశ్వరరావు దాచేపల్లి నగర పంచాయితీ లో పంప్ ఆపరేటర్( ఔట్ సోర్సింగ్) ఉద్యోగి. దాచేపల్లి పట్టణం మోడల్ స్కూల్ సమీపంలోని మిర్చి తోటలో ఘటన జరిగింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పోలీసుల అదుపులో వున్నాడు. నిందితుడు కూడా అదే నగర పంచాయితీ లో పంపు ఆపరేటర్ గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

## బ్రాహ్మణ కొట్కూరులో ఎమ్మార్పీఎస్ ర్యాలీ



**బ్రాహ్మణ కొట్కూరు**

మాదిగ వృద్ధి కొరకు, ఎస్సీ వర్గీల వర్గీకరణ కొరకు, అమరావతి ముట్టడిలో భాగంగా మందకృష్ణ, మాదిగ పిలుపుమేరకు, కర్నూలు నుండి అమరావతి పాదయాత్ర సందర్భంగా, రాష్ట్ర అధ్యక్షుడు బెనర్జీతో, పాటు ఇతర నాయకులు పాదయాత్రగా బయలుదేరుతూ బ్రాహ్మణ కొట్టుకూరు గ్రామంలో మాదిగలు స్వాగతం పలికారు. గ్రామంలో ర్యాలీ చేశారు. ఇందు సందర్భంగా బెనర్జీ మాట్లాడుతూ మాదిగల అభివృద్ధికి పాటుపడాలని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ర్యాలీలో (ఎమ్మార్పీఎస్) నాయకులు జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్, ప్రేమ్ రాజ్ ,నాగరాజు, శ్రీనివాసులు మరియు బ్రాహ్మణ కొట్కూర్ గ్రామం (ఎమ్మార్పీఎస్) కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ర్యాలీ ఏబీఎం చర్చి నుండి ప్రారంభమై అమరావతి వరకు కొనసాగుతుంది. ఎమ్మార్పీఎస్ వర్ధిల్లాలని నినాదాలతో హోరెత్తించారు.

## టీడీపీ నేత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రులు

**పామర్రు**

గన్నవరం ఘటనలో రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న బీసీ నాయకుడు వీరంకి గురుమూర్తి కుటుంబ సభ్యులను మాజీ మంత్రులు పరామర్శించారు.

తోట్లవల్లూరులోని గురుమూర్తి స్వగహానికి మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు, మాజీ ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, రావి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ వైవిపి రాజేంద్రప్రసాద్, పామర్రు టిడిపి ఇన్చార్జ్ వర్ల. కుమార్ రాజా టిడిపి నేతలు చేరుకున్నారు. గురుమూర్తి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి మనోధైర్యం చెప్పారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు..

## శిశువు మృతి-బంధువుల అందోళన

**కృష్ణాజిల్లా**

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు పీ.హెచ్.సీ లో డాక్టర్ కళ్యాణి నిర్లక్ష్యం వలనే తమ బిడ్డ మృతి చెందాడని భాదితులు నిరసన చేపట్టారు. కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన రూపశ్రీ ప్రసవ నొప్పులతో నిన్న మధ్యాహ్నం జి.కొండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. రాత్రి 11గంటలకు ప్రసవం అయింది. శిశువుకు చలనం లేకపోవడంతో విజయవాడ తీసుకెళ్ళమని ఆసుపత్రి సిబ్బందిఅంబులెన్సు పిలిపించారు. విజయవాడ వైద్యులుబిడ్డ మృతి చెందినట్లు దృవీకరించారు. దాంతో, డాక్టర్ కళ్యాణి పెళ్ళికి వెళ్ళి,స్టాఫ్ నర్స్ తో డెలివరీ చేయించడం వలనే ఇలా జరిగిందంటూ బందువులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ చనిపోయిన బాబును చేతిలో పట్టుకుని ఆసుపత్రి ముందు నిరసన తెలిసారు. భాదితులు డయల్ 100కి ఫోన్ చేసారు. ఎస్సై ధర్మరాజు ఆసుపత్రి వద్దకు చేరుకుని వివరాలు తీసుకున్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# ఎట్టకేలకు పోలీసుల కేసు

**హైదరాబాద్:**

తెలంగాణలో సంచలనం అయిన అంబర్ పేట్ కుక్కల దాడి ఘటనపై పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. లీగల్ ఒపీనియన్ తీసుకుని మూడు రోజుల తర్వాత కేసు నమోదు చేశారు. 174 సీఆర్పీఈసీ ప్రకారం కేసు నమోదు చేశారు పోలీసులు. అయితే కేసులో నిందితులు ఎవరినీ చూపెట్టలేదు. బాలుడిని ఎవరు చంపారో ఎఫ్ఐఆర్ లో పోలీసులు నమోదు చేయలేదు. హైదరాబాద్‌లో ఇటీవల హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. పిల్లలకు సెలవు కావడంతో.. పిల్లలను తనతో పాటు పని చేసే చోటుకి తీసుకెళ్లాడు. తండ్రి పని చేసుకుంటుండగా పిల్లలు ఆడుకుంటున్నారు. ఈ క్రమంలోనే అక్క కాస్త దూరంగా ఉండడంతో నాలుగేళ్ల కుమారుడు అటువైపు వెళ్లాలనుకున్నాడు. ఇదే సమయంలో అక్కడకు వచ్చిన వీధి కుక్కలు బాలుడిపైకి పరిగెత్తుకొచ్చాయి. విషయం గుర్తించిన బాలుడి వాటి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ వదలకుండా అతనిపై దాడి చేశాయి. మూడు కుక్కలు బాలుడి శరీర భాగాలను నోట కరుచుకొని ఒక్కోవైపుగా లాగడం మొదలు పెట్టాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. నిజామాబాద్ జిల్లా ఇందల్ వాయి మండల కేంద్రానికి చెందిన గంగాధర్ నాలుగేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం హైదరాబాద్ కు వచ్చాడు. చే నంబరు చౌరస్తాలోని ఓ కారు సర్వీస్ సెంటర్ లో వాచ్ మెన్ గా పని చేస్తూ భార్యాపిల్లలను పోషిస్తున్నాడు. భార్య జనప్రియ, ఆరేళ్ల కుమార్తె, నాలుగేళ్ల కుమారుడు ప్రదీప్ తో కలిసి బాగ్ అంబర్ పేట ఎరుకల బస్తీలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం రోజు సెలవు కావడంతో పిల్లలిద్దరినీ వెంట బెట్టుకొని తాను పని చేస్తున్న సర్వీస్ సెంటర్ లోపలికి తీసుకెళ్లాడు. కుమారుడు ఆడుకుంటూ ఉండగా.. మరో వాచ్ మెన్ తో కలిసి గంగాధర్ వేరే ప్రాంతానికి వెళ్లాడు. కాసేపు అక్కడే ఆడుకున్న ప్రదీప్.. ఆ తర్వాత తన అక్క కోసం క్యాబిన్ వైపు నడుచుకుంటూ వెళ్లాడు. ఈ క్రమంలోనే వీధి కుక్కలు వెంటపడ్డాయి. భయపడిన బాలుడు వాటి నుంచి తప్పించుకునేందుకు అటూ ఇటూ పరుగులు తీశాడు. ప్రాణాలను కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేశాడు. కానీ కాలయముల్లా ఆ వీధి కుక్కలు మాత్రం బాలుడిపైకి వస్తూనే ఉన్నాయి. ఇటీవల హైదరాబాద్ లోని అంబర్ పేటలో వీధి కుక్కల దాడిలో బాలుడు మృతి చెందిన ఘటనపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇదివరకే ఈ ఘటనపై తీవ్ర విమర్శలు, ఆరోపణలు రావడంతో పరిస్థితిని గ్రహించిన హైకోర్టు కేసును సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. నాలుగేళ్ల బాలుడు ప్రదీప్ పై తండ్రి పనిచేసే చోట వీధి కుక్కలు దారుణంగా దాడి చేయడం అమానుష ఘటన అని హైకోర్టు వ్యాఖ్యానించింది. కుక్కల దాడిలో పసివాడు మృతిచెందడం అత్యంత బాధాకరమని చెప్పింది. ఇలాంటి ఘటనలు జరుగుతుంటే జీహెచ్ఎంసీ ఏం చేస్తుందని, మీ నిర్లక్ష్యంతోనే బాలుడు చనిపోయాడంటూ హైకోర్టు మండిపడింది. తదుపరి విచారణను హైకోర్టు మార్చి16కి వాయిదా వేసింది. నగరంలో గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని, వీధి కుక్కలు దాడులు పెరిగిపోతుంటే మీరు ఏం చర్యలు తీసుకున్నారని జీహెచ్ఎంసీని హైకోర్టు ప్రశ్నించింది. ఇలాంటి ఘటనలు మరోసారి రిపీట్ కాకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారని జీహెచ్ఎంసీని హైకోర్టు ప్రశ్నించింది. బాలుడు ప్రదీప్ మృతికి నష్ట పరిహారం చెల్లించడాన్ని పరిగణలోకి తీసుకుంటామని హైకోర్టు తెలిపింది. ఈ ఘటనపై తెలంగాణ చీఫ్ సెక్రటరీ, జీహెచ్ఎంసీ, హైదరాబాద్ కలెక్టర్, తెలంగాణ లీగల్ సెల్ అథారిటీ, అంబర్ పేట్ మున్సిపల్ అధికారికి రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను మార్చి16కి వాయిదా వేసింది.

# కాంగ్రెస్ పై కవిత సెటైర్లు

**హైదరాబాద్ :**



వందేళ్ల కాంగ్రెస్ పార్టీని నిన్నగాక మొన్న పేరుమార్చుకుని జాతీయ అవతారం ఎత్తిన బీఆర్ఎస్ ఎక్కిరించడం కొత్త సామెత. అవును ఢిల్లీ లిక్కర్ స్కాం పుణ్యాన జాతీయ మీడియాలో తరచూ వినిపిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుట్ల కవిత కాంగ్రెస్ ఎక్కిరించారు. ఎగతాళి చేశారు. ప్రతిపక్షాలకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వం వహిస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను కవిత ఎద్దేవా చేశారు. ఒక జాతీయ టీవీ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె, కాంగ్రెస్ పార్టీని చులకన చేసి మాట్లాడారు. అంతేకాదు హస్తం పార్టీ అహంకారం వీడాలని సలహా కూడా ఇచ్చారు. ప్రస్తుతానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో బలహీనంగా ఉన్న మాట నిజమే కానీ, ఇప్పటికీ ప్రతిపక్ష పార్టీలు అన్నిటిలో నిజమైన జాతీయ హోదా గుర్తింపు ఉన్న పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే. సంఖ్యాపరంగా చూసినా పార్టీ మనుగడ పరంగా చూసినా బీజేపీకి కాంగ్రెస్ పార్టీ ఒక్కటే జాతీయ ప్రత్యామ్నాయం. ఇది బీఆర్ఎస్ మాత్రమే కాదు , కమలం పార్టీ కూడా కాదనలేని, అంగీకరించి తీరాల్సిన నిజం. మిగిలిన పార్టీలలో వేటికీ కూడా లోక్ సభలో మూడంకెల సంఖ్యను దాటిన చరిత్ర లేదు. సమీప భవిష్యత్ లో బీఆరేఎస్ సహా మరే ఇతర జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఏవీ కూడా మూడంకెల సంఖ్యకు చేరుకునే అవకాశం లేశ మాత్రంగా కనిపించడం లేదు.మరో వంక వందేళ్ళకు పైబడిన చరిత్ర ఇంచుమించుగా 50 ఏళ్లకు పైగా దేశాన్ని పాలించిన అనుభవం ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ. అంతేకాదు పదేళ్లకు పైగా కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలను నడిపించిన అనుభవం ఉన్న పార్టీ కూడా కాంగ్రెస్ పార్టీయే. ఈ రోజుకు కూడా పార్లమెంట్ లో ప్రతిపక్ష హోదాలో ఉన్నది కాంగ్రెస్ పార్టీకే. సో.. ఖర్గే చెప్పినా చెప్పక పోయినా సహజంగానే బీజేపీ వ్యతిరేక పార్టీలకు ప్రతిపక్షాలకు నాయకత్వం వహించేది కాంగ్రెస్ పార్టీయే. అందులో సందేహం లేదు. బీజేపీకి జాతీయ ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీ లేదా కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ కూటమి. ప్రాంతీయ పార్టీల జాతీయ కూటమి ఏర్పాటు కోసం కేసీఆర్ కాలికి బలపం కట్టుకుని దేశ మంతా తిరిగినా ఒక్కటంటే ఒక్క ప్రాంతీయ పార్టీ కూడా కాంగ్రెస్ ను కాదని కేసీఆర్ తో జట్టుకట్టలేదు. చివరకు చేసేదేంలేక కేసిఆర్ జాతీయ రాజకీయాలలో ప్రవేశం కోసం, ఎంట్రీ పాస్ గా టీఆర్ఎస్ పేరును, బీఆర్ఎస్ మార్చుకున్నారు. మరోవంక ఒక మమత బెనర్జీ, ఒక కేసీఆర్, ఒక అరవింద్ కేజ్రీవాల్ మినహా మిగిలిన ప్రాంతీయ పార్టీలు ముఖ్యంగా శరద్ పవార్, నితీష్ కుమార్ ఎంకే స్టాలిన్ వంటి ఉద్దండ నాయకులు కాంగ్రెస్ చెయ్యి వదిలేది లేదని కుండబద్దలు కొట్టారు. చివరకు వామ పక్ష పార్టీలు కూడా ప్రాంతీయ స్థాయిలో ఏ పార్టీలతో పొట్టు పెట్టుకున్నా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకే మద్దతు ఉంటుందని స్పష్టంగా చెపుతూనే ఉన్నాయి. నిజానికి నిజం ఏమిటో జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ భవిష్యత్ ఏమిటో కవితకు తెలియంది కాదు. చివరకు కేంద్రంలోనే కాదు, అవసరం అయితే రాష్ట్రంలోనూ కాంగ్రెస్ తో చేతులు కలపక తప్పదనే విషయం కేసేఆర్ మొదలు కవిత వరకు అందరికీ తెలుసు. అలాగే, రాష్ట్రంలో అధికారం నిలుపుకునేందుకే బీఆర్ఎస్ జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలాన్ని గుర్తించడం లేదని అంటున్నారు.

# ప్రగతి భవన్ లో అత్యవసర సమావేశాలు..?

**హైదరాబాద్ :**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రెండు, మూడు రోజులుగా సీనియర్ నేతలతో విస్తృతంగా చర్చలు జరుపుతున్నారు. ఏఏ జిల్లాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఏఏ నియోజకవర్గాల్లో ఎవరెవరికి విజయాశకాలున్నా యనే కోణంలో కీలక నేతల నుంచి సమాచార సేకరణ జరిపారు. ఓ రకంగా అభ్యర్థుల్ని ఖరారు చేశారని చెబుతున్నారు. ముందస్తు ఎన్నికలు ఉంటాయా లేదా అన్న సంగతి పక్కన పెట్టినా .. నవంబర్ , డిసెంబర్‌లో జరగనున్న ఎన్నికల కోసం అయినా ఇప్పటికే అభ్యర్థులపై ఓ అవగాహనకు రావాలని నిర్ణయించుకున్నారని చెబుతున్నారు. ఎక్కడెక్కడ కొత్త వారికివ్వాలో లిస్ట్ తయారు చేసి.. సామర్థ్యం ఉన్న నేతలకు ఇక నుంచి సంకేతాలివ్వనున్నట్లుగా తెలుస్తోంది. సిట్టింగ్‌లు అందరికీ సీట్లిస్తామని కేసీఆర్ చెప్పినప్పటికీ కొంత మందికి మొండి చేయి చూపించక తప్పదన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటి వరకూ చేయించిన సర్వేల్లో గట్టి పోటీ ఉన్నట్లుగా తేలిన నియోజవకర్గాలపై కేసీఆర్ స్వయంగా కసరత్తు చేస్తున్నారు. ఆ స్థానాల్లో గట్టి అభ్యర్థులను పెట్టడమే కాదు.. ఒకటికి రెండుసార్లు పర్యటించి గెలిపించుకోవాలని వ్యూహం అమలు చేయబోతున్నట్లగాచెబుతున్నారు. గెలుపే లక్ష్యంగా ప్రతి నియోజకవర్గానికి వేర్వేరు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసి సాధ్యమైనంత త్వరలో పంపించాలని నిర్ణయించినట్లుగా బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. సీటు పక్కా అన్న అభ్యర్థులతో త్వరలోనే కేటీఆర్ అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నారు. ప్రగతి భవన్ ‘అత్యవసరం సమావేశాల’ వెనుక అసలు సీక్రెట్ ఇదేనని అత్యంత విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.పార్లమెంట్ కంటే ముందే తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ముందస్తుకు వెళ్లినా వెళ్లకపోయినా తప్పదు. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో బీఆర్ఎస్ విస్తరణ చేయాలంటే.. మూడో సారి గెలిచి తీరాలి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి కొన్ని గంటలపాటు మంత్రులు కేటీ–ఆర్, హరీష్ రావులతో ప్రగతిభవన్‌లో కేసీఆర్ ప్రత్యేక భేటీ జరిగింది. ఈ అత్యవసర సమావేశంలో కొంతసేపటి తర్వాత పార్టీలోని ముఖ్యమైన నాయకులను పిలిపించుకుని విస్తృతంగా చర్చించారు. కేసీఆర్ ఇంత హడావుడిగా మీటింగ్ పెట్టడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే ఆ సమావేశం వివరాలు బయటకు పొక్కనీయలేదు. కానీ అభ్యర్థులను ఫైనల్ చేసే చర్చ జరుగుతోందన్న అభిప్రాయం మాత్రం ఎక్కువగా వినిపిస్తోంది. ఎన్నికల ప్రచార వ్యూహంపైనా బీఆర్ఎస్ హైకమాండ్ ఇప్పటికే ఓ ప్లాన్ రెడీ చేసుకుంది. ప్రజలకు ఎలాంటి హామీలు ఇవ్వాలి? ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టాలి? అనే దానిపై కూడా చర్చ సాగుతున్నట్లు– తెలుస్తోంది. ఇప్పటికే అమలులో ఉన్న రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్ లాంటి పథకాలపై మార్పులు చేయాలా? లేక వీటి స్థానంలో కొత్తవి తీసుకురావాలా? అనేదానిపై ఓ క్లారిటీకి వచ్చారు. తెలంగాణ ప్రభుత్వం గడువు జనవరి 2024 వరకు ఉంది. అంటే సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించే ఛాన్స్ ఉంది. ఆరు నెలల ముందుగానే ఎన్నికలు జరిగితే.. ముందస్తు ఏం కాదనే వాదన కేసీఆర్ వినిపిస్తారు. ఆ ప్రకారం రెండు, మూడు నెలల్లో జరగాల్సి ఉన్న కర్ణాటకతో పాటు ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుందన్న చర్చకూడా నడుస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో మొత్తంగా కీలక మార్పులు రానున్నట్లుగా అంచనా వేయవచ్చు.

# నూతన గవర్నర్ ను కలిసిన విజయసాయిరెడ్డి

**విజయవాడ**




రాష్ట్ర నూతన గవర్నర్ గా అబ్దుల్ నజీర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయనను రాజ్యసభ సభ్యులు, వైఎస్ఆర్సీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి విజయవాడలో రాజ్ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

ఏపిలో మరింత సులభంగా ఎగుమతులు : దేశ ఎగుమతుల్లో 10 శాతం వాటా సాధించాన్న లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అన్నారు. ఎగుమతుల్లో కీలకపాత్ర పోషించే కేంద్ర వాణిజ్యశాఖకు చెందిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్ పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఈవో) కార్యకలాపాలు ప్రారంభించిందని వెల్లడించారు. జగన్ తోనే సామాజిక న్యాయం : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శాసన మండలి అభ్యర్థులుగా 18 ఖాళీలలో 11 బీసీలకు, 2 ఎస్సీలకు, 1 ఎస్టీలకు, 4 ఓసీలకు ఇవ్వడం ద్వారా సామాజిక న్యాయాన్ని అమలు చేశారని చెప్పారు.దీని ద్వారా శాసన మండలిలో అన్ని కులాలకు ప్రాతినిధ్యం ఉండటంతో పాటు వారి గొంతు వినిపించే అవకాశం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు

# నిరుద్యోగ నిర్మూలనే భారస ప్రభుత్వ లక్ష్యం

**సూర్యాపేట**



సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో వేలాది మంది నిరుద్యోగ యువతీ యువకులు తరలి వచ్చిన వైనం.పెరిక హాస్టల్ భవన్ లో కీకిరిసిన నిరుద్యోగ యువత. 72 కంపెనీలు తొమ్మిది వేల ఉద్యోగాలకు ఎంపికలు.నగరాలకు వెళ్లి ప్రముఖ సంస్థ ల్లో ఉద్యోగ అవకాశాలు వెతుక్కోలేక ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటి ముంగిటకు ప్రముఖ పలు రకాల సాఫ్ట్వేర్ కంపెనీలను ఆహ్వానించి వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పించిన కనుమంత రెడ్డి శశిధర్ రెడ్డి అభినందనీయులని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు అన్నారు . కోదాడ పట్టణంలోని పెరిక భవన్లో బిఆర్ఎస్ పార్టీ కోదాడ నియోజక వర్గ మాజీ ఇంచార్జ్ కన్వంత్ రెడ్డి శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన మెగా జాబ్ మేళను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ నిర్మూలన లక్ష్యంగా పనిచేస్తుందన్నారు నేడు తెలంగాణ రాష్ట్రానికి ప్రపంచవ్యాప్తంగా పలు కంపెనీలు పెట్టడానికి పోటీలు పడుతున్నాయన్నారు. ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ హైదరాబాదు నగరాన్ని ఐటీ పార్క్ గా హబ్ గా తీర్చిదిద్దారన్నారు. దీనితో నేడు ఇంజనీరింగ్ ఫార్మసీ ఎంబీఏ ,ఎంసీఏ వంటి ఉన్నత విద్యలు పూర్తిచేసిన ఎంతోమంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయి అన్నారు. కోదాడ ప్రాంతం మొదటి నుండి విద్య వాణిజ్య రంగాల్లో పేరుగాంచిందని అన్నారు. గత రెండు దశాబ్దాల కాలం నుండి కోదాడలో ఇంజనీరింగ్ కళాశాల లు నగరాలకు దీటుగా స్థాపించబడ్డాయి అన్నారు. నిరుద్యోగ యువత కు ఈ మెగా జాబ్ మేళా కల్ప తరువు వంటిదని కొనియాడారు.కే ఆర్ ఆర్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ అందిసత్య మాట్లాడుతూ, వేలాది మంది నిరుద్యోగ యువతకు కోదాడ జాబ్ మేళా వేదికగా కావడం అభినందనీయమన్నారు. విద్యా అర్హతలు ఉండి కూడా సమాచార లోపంతో ఎంతోమంది విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఇటువంటి తరుణంలో స్థానికంగా జాబ్ మేళాను నిర్వహించి గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన శశిధర్ రెడ్డి ఆలోచన ప్రశంసనీయమన్నారు. కోదాడ పరిసర ప్రాంతా గ్రామాల్లో వేలాదిమంది అర్హత కలిగిన ఉన్నత విద్యావంతులు ఉండడం మానవ వనరుల అభివృద్ధికి తార్కాణం అన్నారు. మెగా జాబ్ మేళా నిర్వాహకులు నిరుద్యోగ యువత పాలిటి ఆశా జ్యోతి రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలు పిల్లల భవిష్యత్తు మీదనే ఆధారపడి ఉంటాయన్నారు. కోదాడ నియోజకవర్గ ప్రాంతంలో వేలాదిమంది ఉన్నత విద్యార్హతలు పూర్తి చేసిన విషయం గమనించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేశానన్నారు ,పిల్లలకు ఉద్యోగాలు వస్తే కుటుంబాలు బలపడతాయని భావించే తల్లిదండ్రులకు ఆసరాగా ఈ జాబ్ మేళా ను నిర్వహించానని తెలిపారు. భారస కూడా ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నిరుద్యోగులకు అండగా నిలిచిందన్నారు. అదే ప్రభుత్వ సంకల్పంతో తాను కూడా పలు రకాల కంపెనీలను ఆహ్వానించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే చిరు ప్రయత్నం చేశాను అన్నారు. కోదాడ నియోజకవర్గం తన కుటుంబాన్ని ఉద్యోగాలు పొందిన యువతను చూస్తుంటే తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. అందరి సహకారంతో భవిష్యత్తులో మరెన్నో జాబ్ మేళాలు నిర్వహిస్తానన్నారు.బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని వెంకటరత్నం బాబు డిసిసిబి మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు లు మాట్లాడుతూ, ప్రముఖ కంపెనీలు కోదాడ కు రావడం ఎంతో గర్వకారణం అన్నారు.ఈ సందర్భంగా పలువురు ఉద్యోగాలు పొందిన యువతీ యువకులకు అక్కడికక్కడే జాయినింగ్ ఆర్డర్స్ అందజేశారు.

# వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్దిగా మేరిగా మురళీధర్

**నెల్లూరు**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి విధేయులుగా ఉన్న మేరిగా మురళీధర్ కష్టానికిదగ్గ ఫలితం లభించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లా వైకాపా అధ్యక్షుడుగా,గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త బాధ్యతలు చేపట్టి పార్టీ కోసం కోట్లాది రూపాయలుఖర్చు చేసి కష్టకాలంలో జగనన్న వెంట నడిచారు.

2014, 2019 లో వైసీపీ టికెట్ తృటిలో చేజారింది.అయినా పార్టీ పై విమర్శలు చేయలేదు పార్టీ ఉన్నతికి కృషి చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ గా వైసీపీ అధిష్టానం బాధ్యతలు అప్పగించింది.కానీ దురదృష్టం రెండు తెలుగు రాష్ట్రాలతో ఆ పదవీ ముడి పడిన కారణంగా ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. అయినా నిరుత్సాహం చెందలేదు.గూడూరు లోనే ఉంటూ పార్టీకి సేవలుచేస్తూ వైసీపీ నాయకులు ,కార్యకర్తలు, భిమానులకు అందుబాటులో ఉంటూ పార్టీకి విధేయుడు గా ఉన్నారు.ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో మేరిగా మురళీధర్ ను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల వైకాపా అభ్యర్దిగా ప్రకటించారు. ఆ తరువాత ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంభందించి వైసీపి అభ్యర్ధి మేరుగ మురళి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి, తిరుపతి ఎంపి గురుమూర్తి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డితో కలిసి నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన మేరుగ మురళి రిటర్నింగ్ అధికారి అయిన జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ కు మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మేరిగా మురళీధర్ తో పాటు మరో ఇండిపెండెంట్ అభ్యర్థి కూడా నామినేషన్ దాఖలు చేశారు.శుక్రవారం నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అయిన జా యింట్ కలెక్టర్ కూర్మనాథ్ ,ఎన్నికల అధికారులుతీపి నామినేషన్ పరిశీలిన చేపట్టారు.ఈ పరిశీలనలో ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్ ను. తిర స్కరించారు.దింతో మేరుగ మురళీధర్ ఎమ్మెల్సీ గాఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.త్వరలోనే అధికారికంగా మేరిగా మురళీధర్ ను ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల శాసన మండలిసభ్యులు గా ప్రకటించనున్నారు

## ఎదురు కాల్పుల్లో ముగ్గురు జవాన్లు మృతి

**సుక్మా**

చత్తీస్ ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్ల అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎన్కౌంటర్ లో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. సుకుమా జిల్లా జేగురుగొండ,కుందేడ్ మధ్య అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో డీఆర్జీ జవాన్లు మృతి చెందారు. వారంతా కూంబింగ్ కు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఘటన చోటు చేసుకుంది. మృతులు ఏఎస్సై రామ్ సింగ్, అసిస్టెంట్ కానిస్టేబుల్ కుంజం జోగా, వంజం బీమా గా గుర్తించారు. సుక్మా జిల్లా ఎస్పీ సునీల్ శర్మ ఎన్కౌంటర్ ను ధ్రువీకరించారు.

## మరోసారి బంగారం స్వాధీనం

**రంగారెడ్డి**

శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేస్తుండగా దుబాయ్ నుండి హైదరాబాద్ వచ్చిన ఓ ప్రయాణికుడి నుండి 823 గ్రాముల బంగారం పట్టివేసారు. నిందితుడు బంగారాన్ని పేస్ట్ గా మార్చి లో దుస్తుల్లో అమర్చుకొని వచ్చినట్లు గుర్తించారు. పట్టుబడిన బంగారం విలువ 45 లక్షలు ఉంటుందని అధికారులు ప్రకటించారు.

## కీచక టీచర్లకు దేహశుద్ది

**మహబూబాబాద్**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని సెయింట్ అగస్టీన్స్ హైస్కూల్ లో కీచక ఉపాధ్యాయుల బండారం బయటపడింది.గత కొంతకాలంగా పాఠశాల విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, వేధిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు, స్కూల్. వ్యాన్ డ్రైవర్,వాచ్ మేన్ లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు ,వారి తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు.విషయం తెలిసి అక్కడకు. చేరుకున్న మరిపెడ ఎస్సై ఝాన్సీ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.విద్యా బుద్ధులు నేర్పే ఉపద్యాయులే ఇలా పైశాచికంగా ప్రవర్తించడం సిగ్గుచేటని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే కేంద్ర లక్ష్యం

**మలక్ పేట**

ప్రజా గోస? బీజేపీ భరోసా' నినాదంతో బీజేపీ నిర్వహిస్తున్న వీధి చివరి (స్టీట్ కార్నర్) సమావేశాం సైదాబాద్ లోని సిద్ధి వినాయక మందిరం దగ్గర నిర్వహించారు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కపిల్ వై రవీందర్ పాల్గొన్నారు.దేశవ్యాప్తంగా అన్ని వర్గాల సంక్షే మం కోసమే మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని బీజేపీ రవీందర్ అన్నారు. కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులు కొట్లాడి తెచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారనివిమర్శించారు.2లక్షల ఉద్యోగాల ఖాళీలున్నా 20వేల ఉద్యోగాలే బర్తీ చేస్తున్నారన్నారు. కార్పొరేటర్ కొత్త కాపు అరుణ మా ట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసమే మోదీ ప్రభుత్వం పని చేస్తున్నాడని తెలిపారు తెలంగాణ ప్రభుత్వం ప్రజలను మాయమాటలతో మభ్య పెడుతుందని విమర్శించారు.మలక్పేట్ నియోజకవర్గంలో ప్రజలు బీజేపీ తో ఉన్నారు అన్ని జిల్లా అధ్యక్షుడు సురేందర్ రెడ్డి అన్నారు, కార్యక్రమంలో సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణా రవీందర్ రెడ్డి,కొల్ల గోపి,మలక్పేట్ సీనియర్ లీడర్ కొత్త కాపు రవీందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వినోద్ గౌడ్,నవీన్ రెడ్డి ,గజానంద్ గౌడ్ 3,10,11, బూత్ అధ్యక్షులు వెంకట్ రాజ్ ,సాగర్, సాయి వంశీ,మరియు పార్టీ నాయకులు ,యువ నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో పోలీసులతో కిరికిరి

**మెదక్**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పు లింగాపూర్ లో దారుణం జరిగింది. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం మత్తులో ఉన్న ఒక వ్యక్తి వారితో వాగ్వాదానికి దిగారు. దాంతో పోలీసులు అతనిపై చెయి చేసుకున్నారు. ఆగ్రహానికి గురైన వ్యక్తి విద్యుత్ స్తంభం ఎక్కి తీగలని పట్టుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా హాస్పిటల్ కి తరలించారు.

## మత్స్యకారుడి హత్యకేసులో ఆరుగురు అరెస్టు

**కడప**

కడపజిల్లా గోపవరం మండలం సోమశిల వెనుక జలాలలో రామాంజనేయులు అనే మత్స్యకారుడిని హత్య చేశారు. తోటి మత్స్యకారులు. మృతుడు రామాంజనేయులు కు ఇతర మత్స్యకారులకు మధ్య కొద్ది రోజుల క్రితం ఘర్షణ దిగింది ఈ ఘర్షణలో రామాంజనేయులు ను తోటి మత్స్యకారులు నీటిలోంచి ఒడ్డుకు పారిపోయే సమయంలో తాడుతో గొంతు నులిమి హత్య చేసి నీటిలో వేశారు. అనంతరం తోటి మత్స్యకారులు దీన్ని సాధారణ మృతిగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. అనంతరం కేసు నమోదు చేసిన బద్వేల్ రూరల్ పోలీసులు అన్ని కోణాల్లో విచారించిన నేపథ్యంలో ఇది హత్యగా కేసు నమోదు చేసి హత్యకు కారణమైన ఆరు మంది మత్స్యకారులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు మీడియాకు వెల్లడించిన మైదుకూరు డిఎస్పి వంశీధర్ గౌడ్

# కేటీఆర్ కు పట్టాభిషేకానికి ముహూర్తం..?

**హైదరాబాద్ :**



తెలంగాణ రాష్ట్ర శాసన సభ ఎన్నికల సమీపిస్తున్నాయి. ఇంచు మించుగా ఏడాది నుంచే ముందస్తు ఊహాగానాలు వినిపిస్తూ వచ్చినా, ఎందుకనో గానీ, ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముందస్తు నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికీ ఇక్కడా అక్కడా ముందస్తు మాట వినిపిస్తున్నా, ఇక ముందస్తు ముచ్చట లేనట్లే అనే అభిప్రాయమే బలపడుతోంది. అధికార పార్టీ 'ముఖ్య' నాయకుడు సహా ఆ పార్టీ నాయకులు అందరూ, ఎన్నికలకు ఇంకా ఎనిమిది నెలలే సమయం ఉందని క్యాడర్ ను సన్నద్ధం చేస్తున్నారు. జయశంకర్ భూపాల పల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభలోనూ ఎన్నికలకు ఇంకా ఎనిమిది నెలల సమయముందనే అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు తరుముకొస్తున్నా, ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలకంటే, జాతీయ రాజకీయాలపైనే అంతకంటే ముఖ్యంగా, ఏపీలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని అంటున్నారు. నిజానికి ఇంతవరకు తెలంగాణ సహా మరే రాష్ట్రంలోనూ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుల నియామకం జరగలేదు. అందుకు ఒకే ఒక్క మినహాయింపు ఆంధ్రప్రదేశ్. టీఆర్ఎస్ పేరు మారి బీఆర్ఎస్ గా అవతరించిన కొద్ది రోజులకే మూడు పార్టీలు మారి వచ్చిన తోట చంద్రశేఖర్ ను పార్టీలో చేర్చుకుని బీఆర్ఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు కట్టబెట్టారు. అంతేకాదు ప్రగతి భవన్ లో తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలకంటే ఏపీ నాయకులకు ఎక్కువ గౌరవ మర్యాదలు దక్కుతున్నాయనీ, వారు ఎప్పుడు కావాలంటే అప్పుడు వచ్చిపోయేందుకు వీలుగా గ్రీన్ కార్డు ఎంట్రీ సదుపాయం కల్పించారనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. కేసీఆర్ ప్రత్యేక దృష్టి కారణంగానే ఏపీలో బీఆర్ఎస్ లోకి చేరికలు కొనసాగుతున్నాయని అంటున్నారు. తాజాగా విజయవాడ మాజీ మేయర్ తాడి శకుంతల బీఆర్ఎస్ లో చేరారు. ఆమెతో పాటుగా మహిళా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వేమవరపు వరలక్ష్మి, ఓబీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.మాల్యాద్రితో పాటు మరికొందరు మైనారిటీ నాయకులు గుంటూరు పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ సమక్షంలో పార్టీలో చేరారు.విజయవాడ మొగల్రాజపురానికి చెందిన శకుంతల గతంలో విజయవాడ మేయర్‌గా పనిచేశారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పొత్తులో భాగంగా 2005-06లో సీపీఐ తరఫున మొదటి ఏడాది మేయర్‌గా పనిచేసిన ఆమె, ఆ తర్వాత కాంగ్రెస్‌లో కొంత కాలం, ఆ తర్వాత టీడీపీ మరికొంత కాలం పనిచేశారు. చివరకు 2019 ఎన్నికల సమయంలో వైసీపీలో చేరారు. అయితే అక్కడ ఆమెకు తగిన ప్రాధాన్యత దక్కలేదో ఏమో గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇప్పుడు ఆమె మరో మారు కండువా మార్చారు. బీఆర్ఎస్‌లో చేరారు. కారణం ఏమైనా కేసీఆర్ తెలంగాణ రాజకీయాల కంటే, ఏపీ పాలిటిక్స్ కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, అందుకే ఆయన ఎపీ లోనూ న్యూస్ పేపర్ (నమస్తే ఆంధ్ర ప్రదేశ్) ప్రారంభించే ఆలోచన చేస్తున్నారని అంటున్నారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఏపీలో 175 సీట్లలో బీఆర్ఎస్ పోటీ చేస్తుందని ఇప్పటికే కేసీఆర్ స్పష్టం చేశారు. అయితే ఎంత చేసినా ఏపీలో బీఆర్ఎస్ కు ఓట్లే కానీ సీట్లు రావని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. అయితే ఆ సంగతి కేసీఆర్ కు తెలియదని అనుకోలేం. కేటీఆర్' పట్టాభిషేకం కోసం గ్రౌండ్ ప్రిపేర్ చేసేందుకే కేసీఆర్ వ్యూహాత్మకంగా, ఓ వంక ఇటు పార్టీలో, అటు ప్రభుత్వంలో కేటీఆర్ ప్రాధాన్యత పెంచుతూ, అదే సమయంలో జాతీయ రాజకీయాల పేరిట తమ ప్రాధాన్యతను ఉద్దేశపూర్వకంగా తగ్గించుకున్తున్నారని అంటున్నారు.

# హత్య కేసులో ఆరు మంది అరెస్టు

**బద్వేలు**



తన మాట వినడం లేదని ప్రొద్దుటూరు పట్టణం సంజీవనగర్ కాలనీకి చెందిన చిన్న మూయల రామాంజనేయులు 36 అనే యువకుడ్ని హత్య చేసినఆరు మందిని బద్వేలు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు శనివారం బద్వేలు రూరల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మైదుకూరు డిఎస్పి వంశీధర్ గౌడ్ బద్వేలు రూరల్ సీఐ హనుమంతు నాయక్ ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు నాలుగు రోజుల క్రితం వీరు రామాంజనేయులు హత్య చేశారు ప్రొద్దుటూరు పట్టణం సంజీవ నగర్ చెందిన రామాంజనేయులు ను ఈనెల 16వ తేదీ గోపవరం మండలం సోమేశుల ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ లో జరిగే చేపల వేటకు పిలుచుకుపోయారు వీరంతా ఒక క్యాంపులో ఉండేవారు క్యాంపులో నాగేశ్వరరావు పెద్దగా ఉండేవాడు ఇతని స్వగ్రామం ప్రకాశం జిల్లా కొత్తపేటనాగేశ్వరరావు చెప్పిన మాట రామాంజనేయులు వినేవాడు కాదు ఇలాగే ఉంటే క్యాంపులో ఎవరు కూడా మాట వినరని ఇతరులు చెప్పడం జరిగింది దీంతో నాగేశ్వరరావు రామాంజనేయులు ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు అనుకున్న ప్రకారం నాగేశ్వరావు సుధాకర్లు రామాంజనేయులు గొంతుకు తాడు బిగించి చంపేశారు రామాంజనేయులు ను క్యాంపు లో ఉన్న శివ ముస్తఫా చూశారు వారిని అక్కడి నుండి వెళ్లిపొమ్మని నాగేశ్వరావు చెప్పడం జరిగింది క్యాంపులో వారికి ఈ విషయం తెలియకుండా దాచిపెట్టారు ఆ తరువాత రామాంజనేయులు మృతదేహాన్ని గోపవరం మండలంసూరేపల్లి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సోమేశుల జలాశయం మునక ప్రాంతం అయినగాజులపల్లి గ్రామానికి సమీపంలో ఉన్న ఒక పాడుబడిన బావిలో వేశారు రామాంజనేయులకు ఈత రానందున బావిలో పడి మృతి చెంది ఉంటాడని ఒక కథనం అల్లారు ఇదే విషయాన్ని రామాంజనేయులు భార్య దుర్గకు శివరాజు చెప్పడం జరిగింది తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని దుర్గ బద్వేలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు దీంతో పోలీసులు విచారణ చేపట్టారు నెల్లూరు జిల్లా సోమేశుల గ్రామానికి చెందిన సింహాద్రి తోపాటు మరో ఆరు మంది ముద్దాయిలు పట్టుకువచ్చి పోలీసులు విచారణ చేశారు దీంతో అసలు విషయాలు వెలుగు చూశాయి హత్య కేసులో నాగేశ్వరరావు తోపాటు నెల్లూరు జిల్లా సోమేశుల మండలం ఖమ్మంపాడు గ్రామానికి చెందిన సుధాకర్ ఇదే జిల్లా సోమేశుల గ్రామానికి చెందిన ఇదే జిల్లా సోమేశుల గ్రామంలో ఉంటున్న విశాఖపట్నం జిల్లా అశోక్ సోమేశుల గ్రామానికి చెందిన మల్లికార్జున ఇదే గ్రామానికి చెందిన బాబ్జిలను పోలీసులు అరెస్ట్ చేశారు విలేకరుల సమావేశంలో బద్వేల్ రూరల్ ఎస్సై చంద్రశేఖర్ గ్రామీణ పోలీసులు పాల్గొన్నారు హత్య కేసును చేదించిన డి.ఎస్.పి వంశీధర్ గౌడ్ రూరల్ సీఐ హనుమంతు నాయక్ పోలీసులను కడప జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు

# రాష్ట్రంలో రాక్షస పాలన

**తిరుపతి**

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక హకు ్కలను భంగపరుస్తున్నారు. ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని టిడిపి సీనియర్ నేత యనమల రామ కృష్ణుడు ఆరోపించారు. ప్రజల సమస్య లను పరిష్కరించేందుకు, సేవ చేసేందుకు ప్రతిపక్షాలు ఉన్నాయి. రాష్ట్రంలో రాక్షస ప్రభుత్వం నడుస్తోంది. జగన్మోహన్ రెడ్డిపై 11 ఛార్జ్‌షీట్లు నమోదయ్యాయి. జగన్మోహన్ రెడ్డి చరిత్ర అవినీతి మయం, అక్రమార్జన. ఇలాంటి వ్యక్తి ఆధ్వర్యంలో రాష్ట్ర పాలన జరుగడం దురదృష్టకరం. రూల్ ఆఫ్ లా ను చేతుల్లోకి తీసుకు న్నారు. పాదయాత్ర ఎవరైనా చేసుకోవచ్చు మైక్ లాక్కోవడం , స్టూల్ ను లాక్కోవడం లాంటి పనులు ఏపీలోనే చూస్తున్నాం. మీడీయాను నియంత్రిస్తున్నారు. రాజ్యాంగానికి లోబడే పాలన ఉండాలి.... అందుకు విరుద్ధంగా ఏపీలో పాలన నడుస్తోందని అన్నారు. వైఎస్ రాజశేఖం ‘రెడ్డి రెడ్డి, చంద్రబాబు, మాజీ ప్రధాని చంద్రశేఖర్ పాదయాత్రలు చేసినా ఎవరూ అడ్డుకోలేదు. రాజ్యాంగమే దేశానికి ప్రధానం. జగన్మోహన్ రెడ్డికి రాజ్యాంగం పట్ల అవగాహన లేదు, రాజ్యాంగ విరుద్ధంగా నియామకమైన సలహాదారుల సలహాలతో పాలన నడుస్తోంది. ఇసుక, మద్యం, మైన్స్ ను దోపిడీ చేస్తున్నది జగన్మోహన్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి మనుషులే సహజ వనరులను దోపిడి చేస్తున్నారని అన్నారు.రాష్ట్రానికి వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఇండస్ట్రీస్ తీసుకు వచ్చింది. ఒక్క కంపెనీ పేరు చెప్పగలరా. వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగం పెరిగింది. వైకాపా ప్రభుత్వ నాలుగేళ్ళ పాలనలో ఒక రూపాయి పెట్టుబడులను రాష్ట్రానికి తెచ్చారా. ఏపీ పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదు. వాలంటీర్ ఉద్యోగాలు వైసిపి కార్యకర్తలకు ఇచ్చారు. బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారు. పేద వర్గాలను నిండా అప్పుల ఊబిలోకి నింపుతున్నారు. దేశంలో ఏపీ పేదరికం, అరాచకం, అక్రమాలలో ముందుందని అన్నారు.రాష్ట్రంలో అప్పులు .11 లక్షల కోట్లు అప్పు ఉంది. రాష్ట్రానికి తీసుకువచ్చిన అప్పులు ఏమయ్యాయి. వివేకానంద రెడ్డి హత్యకు చంద్రబాబు కు సంబంధం ఏమిటి. వివేకానంద రెడ్డి హత్యను ఎవరు చేశారో రాష్ట్ర ప్రజలకు తెలుసని అన్నారు. లోకేశ్ పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. పాదయాత్రలో వచ్చిన ప్రజల సమస్యలను టిడిపి మ్యానిఫెస్టోలో చేర్చుతాం. రాష్ట్రంలో మూడు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి.

## విద్యార్థిపై అగంతకుడి దాడి

**జంగారెడ్డిగూడెం**

జంగారెడ్డిగూడెం పట్టణంలో స్కూల్ విద్యార్థి పై ఆగంతకుడు దాడి చేశాడు.తల్లిదండ్రుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన సంజయి అనే విద్యార్థి స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అదే స్కూల్లో సంజయ్ తల్లి ప్రైవేట్ టీచర్ గా పనిచేస్తున్నారు. రోజు మాదిరిగానే ఈరోజు కూడా స్కూలుకి బయలుదేరుతుండగా ఇంట్లోకి వచ్చిన అగంతకుడు మీ డాడీ ఎక్కడ అని అడిగి లేరు అని చెప్పడంతో అతనితో తెచ్చుకున్న పదునైన ఆయుధంతో తనపై దాడి చేశాడని తెలిపారు. స్కూలుకి ఇంకా సంజయ్ చేరుకోలేదు అనే సమాచారాన్ని తండ్రికి తెలియపరచగా హుటాహుటిన ఇంటికి వచ్చిన తండ్రికి రక్తపు మడుగులో పడి ఉన్న కొడుకుని చూసి వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స అనంతరం జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వచ్చిన వ్యక్తి ఎవరో తనకు తెలియదని ఇంతకుముందు ఎప్పుడు అతన్ని చూడలేదని విద్యార్థి సంజయ్ తెలిపాడు.

## శ్రీవారి సేవలో కోరుకంటి చందర్

**తిరుమల**

తిరుమల శ్రీవారిని తెలంగాణ ఎమ్మెల్యే కోరుకంటి .చందర్ పటేల్ దర్శించుకున్నారు.. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో చందర్ పటేల్ స్వామి వారి సేవలో పాల్గొని మొక్కలు చెల్లించుకున్నారు.. దర్శనానంతరం ఆలయ వెలుపలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.. తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న కేసీఆర్ కారణ జన్ముడని ఆయన కొనియాడారు.. దేశంలో ఉన్న పేద ప్రజలకు తెలంగాణ రాష్ట్రంలో అందే సంక్షేమ పథకాలు అందించాలని సంకల్పంతో కేసీఆర్ బిఆర్ఎస్ పార్టీ స్థాపించడం జరిగిందన్నారు.. బిఆర్ఎస్ పార్టీకి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒకరికి దేవదేవుడి ఆశీస్సులు ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు.. నాల్గున్నర ఏళ్ళ కాలంలో అనేక సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు.. రాబోవు కాలంలో ప్రజల దీవెనలతో కేసిఆర్ విజయం సాధించనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు..

## వైద్యా విద్యార్థి ఆత్మహత్య

**నిజామాబాద్**

స్థానిక వైద్య కళాశాలలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఫైనల్ ఇయర్ విద్యార్ది దాసరి హర్ష ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. హాస్టల్ లోని రూమ్ 505లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిది మంచిర్యాల జిల్లా జిన్నారం మండలం చింతగూడ.

## ఫీజులుమొత్తం చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తాం

**తిరుపతి**

తిరుపతి రూరల్, చెర్లోపల్లి ఎన్నార్ై కళాశాలలో విద్యార్థులను యాజమాన్యం వేధింపులు గురి చేస్తున్నదని ఆరోపణలు వచ్చాయి. ఫీజులు మొత్తం చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని యాజమాన్యం అంటోంది. ఇష్టారాజ్యంగా రకరకాల ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి పిండి రాబడుతున్న ఎన్నార్ై కళాశాల యాజమాన్యం.అధిక ఫీజులు చెల్లించమని, విద్యార్థులు ఎదురు తిరిగితే ప్రాక్టికల్స్ లో మార్కులు వేయమని యాజమాన్యం బెదిరిస్తోందని ఆరోపించారు. యాజమాన్యం చెప్పిన డబ్బు చెల్లించల్సిందేనా అన్న భయం గుప్పెట్లో విద్యార్థులు ,తల్లి తండ్రులు వున్నారు.

## సోమవారం స్పందన కార్యక్రమం రద్దు

**ఏలూరు,**

స్థానిక సంస్థల ఎమ్మెల్సి ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం నందు ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ నిర్వహించుచున్న కారణంగా ది. 27.02.2023 (సోమవారం) జిల్లా కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించే జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం రద్దు చేయబడినదని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలల్లోను 'స్పందన' కార్యక్రమం ఫిబ్రవరి 27వ తేదీ సోమవారం యథావిధిగా నిర్వహించబడుతుందన్నారు.

## విజృంభిస్తున్న గ్రావెల్ మాఫియా

**నెల్లూరు**

నెల్లూరు జిల్లా, వెంకటాచలం మండలం ఈదగాలి పంచాయతీ శ్రీకాంత్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా గత రోజులుగా విచ్చలవిడిగా గ్రావెల్ తవ్వకాలు .రాత్రి, పగలు అనే తేడా లేకుండా భారీ యంత్రాలతో వందల సంఖ్యలో టిప్పర్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా పెద్ద ఎత్తున గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపడుతున్న గ్రావెల్ మాఫియా .ప్రజా సంపదను కాపాడాల్సిన అధికారులే గ్రావెల్ మాఫియాకి అండగా ఉండి సహకరిస్తున్నారు.ఇప్పటికే వందల సంఖ్యలో టిప్పర్ల అక్రమ గ్రావెల్ రవాణా. కృష్ణపట్నం పోర్టు, నెల్లూరు నగరం వైపు తరలి వెళ్తున్న గ్రావెల్ అక్రమ రవాణా.ముత్తుకూరు మండలానికి చెందిన వైసీపీ నాయకుల కనుసనల్లోనే శ్రీకాంత్ కాలనీలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు.చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న రెవెన్యూ, మైనింగ్, యంత్రాంగం ఇప్పటికైనాచర్యలు తీసుకోవాలి.

# అన్ని చోట్లా అంతేనా...

**వరంగల్ :**

తెలంగాణలో ఎన్నికల వేడి మొదలైంది. మరికొద్ది నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికల నగరా మోగనుంది. దీంతో రాజకీయ పార్టీలన్నీ... వ్యూహాలు, ప్రతివ్యూహాలు రచించే పనిలో పడ్డాయి. ప్రత్యర్థి పార్టీలను డిఫెన్స్ లో పడేసేలా సూటిగా విమర్శనాస్త్రాలను సంధిస్తున్నాయి. మరోవైపు గెలుపు గుర్రాలపై కూడా కసరత్తు చేసే పనిలో పడ్డాయి. మిగతా పార్టీలతో పోల్చితే... అధికార బీఆర్ఎస్ లో మాత్రం రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఇప్పటికే ప్రతి నియోజకవర్గంలో ఇద్దరి నుంచి ముగ్గురు నేతలు ఎమ్మెల్యే టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్న పరిణామాలు కనిపిస్తున్నాయి. మరికొన్ని సీట్లపై నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారు కూడా నజర్ వేసిపెట్టారు. ఫలితంగా పలు స్థానాల్లో గ్రూప్ వార్ తెగ సెగలు పుట్టిస్తోంది. ఈ కేటగిరిలోకే వస్తోంది ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ సీటు. తాజాగా మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఆయన చేసిన కొన్ని కామెంట్స్... చర్చనీయాంశంగా మారాయి. భూపాలపల్లి.... ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో ఆసక్తిరేపుతున్న ఓ సీటు. నిజానికి 2014 ఎన్నికల్లో సిరికొండ మధుసూదనచారి ఇక్కడ్నుంచి గెలిచారు. అంతేకాదు స్పీకర్ గా కూడా అవకాశం దక్కించుకున్నారు. ఇదిలా ఉంటే 2018 ఎన్నికల్లో సిరికొండ అనూహ్యంగా ఓటమిపాలయ్యారు. ఇక్కడ కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. ఇక్కడ్నుంచి గండ్ర వెంకటరమణారెడ్డి గెలిచారు. కొన్నిరోజుల పాటు కాంగ్రెస్ లోనే కొనసాగిన గండ్ర.... కారు ఎక్కారు. అసలు కథ ఇక్కడే మొదలైంది. అప్పటి వరకు బీఆర్ఎస్ నుంచి సిరికొండనే కేరాఫ్ గా ఉండగా... సిట్టింగ్ ఎమ్మెల్యే పార్టీలోకి రావటంతో సీన్ ఒక్కసారిగా మారిపోయింది. అంతా ఆయనే అన్నట్లు నడిపిస్తున్నారు. మొన్నటి వరకు ఎలాంటి పదవి లేకుండా ఉన్న... సిరికొండకు ఎమ్మెల్సీగా అవకాశం దక్కిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్న సిరికొండ...తన ప్రాబల్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎలాగైనా వచ్చే ఎన్నికల్లో సీటు దక్కించుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో....రెండు రోజుల కింద భూపాలపల్లి పర్యటనకు వెళ్లారు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్. పలు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన కేటీఆర్.... కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ పర్యటనలో సిరికొండకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. కేటీఆర్ ని స్వాగతించటానికి వచ్చిన సిరికొండ మధుసూదనా చారిని, ఆయన అనుచరులను పోలీసులు అడుగడుగునా అడ్డుకోవటం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇక సభలో కేటీఆర్ మాట్లాడుతుండగా... గండ్ర, సిరికొండ వర్గాలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇరువర్గాలను సముదాయించినప్పటికీ... వెనక్కి తగ్గలేదు. ఓ దశలో మంత్రి కేటీఆర్... వారిని ఉద్దేశిస్తూ కీలక కామెంట్స్ చేశారు. గత ఎన్నికల్లో సిరికొండను మీరే ఓడగట్టారని... కానీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవించుకున్నారని చెప్పుకొచ్చారు. సిరికొండకు పార్టీలో అధిక ప్రాధాన్యత ఉంటుందని.... ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారని అన్నారు. ఇంకా ఐదేళ్లపాటు ఎమ్మెల్సీగానే ఉంటారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా గండ్ర, ఎమ్మెల్సీగా సిరికొండ ఉంటారని... నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందంటూ మాట్లాడారు. ఈ కామెంట్స్ కాస్త... సిరికొండ వర్గాన్ని తీవ్ర అసంతృప్తికి గురి చేసినట్లు అయింది. వచ్చే ఎన్నికల్లో కూడా గండ్రనే బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తారని కేటీఆర్... పరోక్షంగా చెప్పకనే చెప్పేశారని పలువురు చర్చించుకుంటున్నారు. మొత్తంగా చూస్తే... భూపాలపల్లి టికెట్ విషయంలోనూ బీఆర్ఎస్ హైకమాండ్ ఓ క్లారిటీతోనే ఉన్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే గండ్ర, సిరికొండ వర్గాల మధ్య తీవ్రస్థాయిలో ఆధిపత్యపోరు జరుగుతున్న వేళ... మంత్రి కేటీఆర్ కామెంట్స్ మరింత వేడిని పెంచాయనే చెప్పొచ్చు. ఎన్నికల నాటికి వీరి మధ్య గ్రూప్ వార్ ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో చూడాలి. ఈ మధ్యే హుజురాబాద్ లో పర్యటించిన కేటీఆర్... ఈ తరహా కామెంట్సే చేశారు. అక్కడ గెల్లు వర్సెస్ కౌశిక్ రెడ్డి అన్నట్లు సాగుతున్న ఆధిపత్యపోరుకు చెక్ పెట్టే ప్రయత్నం చేశారు. ఎన్నికల వరకు గ్రౌండ్ లోనే తిరగాలంటూ కౌశిక్ రెడ్డికి సభ వేదికగానే దిశానిర్దేశం చేశారు కేటీఆర్. దీంతో ఆ సీటు నుంచి కౌశిక్ రెడ్డే బరిలో ఉంటారని తెలుస్తోంది.

# వారం లోగా టెండర్లన్ని పూర్తి కావాలి

## ఎర్రబెల్లి దయాకర్ రావు

**హైదరాబాద్**

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పనులపై సంబంధిత అధికారులతో టీఎస్ ఐ ఆర్ డి లో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరాల శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమీక్ష సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈవారం రోజుల్లోగా టెండర్లు పూర్తి కావాలి అన్ని పనులు గ్రాండింగ్ చేయాలి కాంట్రాక్టర్లు రావడంలేదని ఏవేవో కబుర్లు కారణాలు చెప్పవద్దని మంత్రి అన్నారు. నిర్లక్ష్యం గా వ్యవహరించి అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే సంబంధిత నియోజకవర్గ లా ఎమ్మెల్యేలతో సమన్వమయం చేసుకోవాలి. కాంట్రాక్టర్లలతో మాట్లాడండి. ఎట్టి పరిస్థితులోను పనులు పూర్తి కావాలి. పనుల పురోగతి అధికారుల తీరును చూడాలని ఉన్నంత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పనులపై సంబంధిత అధికారులతో టి ఎస్ ఐ ఆర్ డి లో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండు విడుతలు గా నమ్మకంతో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు కావలసిన నిధులు ఇచ్చారు. కెసిఆర్ ఆశీస్సులతో రూ 2,669.74 కోట్ల అంచనా వ్యయంతో 3009 పనులను నిర్ణయించి నిధులు మంజూరు చేశారు. ఇందులో ఇప్పటివరకు 2,109 పనులకు మాత్రమే టెండర్లు వచ్చాయి ఇంకా 9000 పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది వీటిని తొందరగా పూర్తి చేయాలని వారంలోగా అన్ని పనులకు టెండర్లు జరగాలని మంత్రి అన్నారు. జరుగుతున్న పనుల్లో వేగం పెంచాలి. నాణ్యతలో రాజీ వద్దు నిర్ణయిత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులకు సూచించారు..

# భార్య వివాహేతర సంబంధం నేపథ్యంలో భర్త మృతి

**కంచికచర్ల**

భార్య, ప్రియుడు ఇద్దరూ కలిసి భర్తపై దాడి చేసారు. ఆ దాడిలో భర్త మృతిచెందిన ఘటన ఇది. కంచికచర్ల లో శుక్రవారం రాత్రి భర్త కుంచెం రామారావు నిద్రిస్తున్న సమయంలో భార్య ప్రియుడిని ఇంటికి పిలిపించింది. మెలకువ వచ్చి భార్యతో ఉన్న ప్రియుడు ప్రవీణ్ తో భర్త ఘర్షణ పడ్డాడు. దాంతో ప్రియుడు ప్రవీణ్ తన స్నేహితులతో కలిసి రామారావును రామారావును చితకబాది పరారైయారు. గాయాల పాలయిన రామారావును బంధువులు హుటాహుటిన నందిగామ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కుంచెం రామారావు చెందాడు.



వివాహేతర సంబంధం చూశాడని తన కొడుకును చితకబాదారని తెలిపిన రామారావు తల్లి ఆరోపించింది. దెబ్బల దాటికి తాళలేక మృతి చెందాడని తెలిపింది. రామారావు భార్య కంచికచర్ల మండలంలోని మొగులూరు సచివాలయంలో ఏఎన్ఎం గా విధులు నిర్వహిస్తుంది...

# శ్రీవారి సేవలో టిడిపి మాజీమంత్రి బోండా ఉమా

**తిరుమల**

వైఎస్.వివేకానంద రెడ్డి హత్య కేసులో దొరికిన దొంగలకు జైలు శిక్ష తప్పదని టిడిపి మాజీమంత్రి బోండా ఉమా ఆరోపించారు.. శనివారం ఉదయం స్వామి వారి నైవేద్య విరామ సమయంలో బొండా స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.. దర్శనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నారా లోకేష్ మొదలు పెట్టిన యువగళం పాదయాత్రకు వైసీపి ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు కలిస్తున్నారని, పాదయాత్రలో లోకేష్ ను మాట్లాడకుండా మైకులు,స్టూల్ లు లాగేసుకుంటున్నారని మండిపడ్డారు.. పాదయాత్రకు వచ్చిన వారిపై కేసులు పెట్టడం, ఆటోలను సీజ్ చేయడం చేస్తున్నారని, ప్రతిపక్షాలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేయడంతో పాటుగా గొంతును నొక్కె ప్రయత్నం జరుగుతుందన్నారు.. రాష్ట్రంలో రాక్షస పరిపాలన వికృతంగా కొనసాగుతుందని చెప్పిన ఆయన, ఇంటికి వెళ్ళి పోతున్నాంమని ప్రశాంత్ కిషోర్ ఇచ్చిన సర్వేలు, సొంతంగా చేసుకున్న సర్వేలతో జగన్ కు భయం పట్టుకుందన్నారు.. ప్రతిపక్షాల గొంతును నొక్కేందుకు



పార్టీ కార్యాలయాలపై దాడులు, కారులు తగల పెట్టడం వంటివి చేస్తున్నారని విమర్శించారు.. అనపర్తిలో జెడ్ ప్లస్ కేటగిరి ఉన్న చంద్రబాబును దాదాపు ఎనిమిది కిలోమీటర్ల పాటు లైట్లు తీసి నడిపించారన్నారు.. పాదయాత్ర మొదలు పెట్టిన తర్వాత లోకేష్ పై ఇరవై కేసులు పెట్టారని, ఏం తప్పు చేసారని కేసులు పెడుతున్నారని ఆయన ప్రశ్నించారు.. రాజ్యాంగం,చట్టం ఉల్లంఘన చేస్తున్న అధికారులకు కనువిప్పు కలగాలని, రాజ్యాంగం ఇచ్చిన హక్కులకు అధికారులు కాలరాస్తున్నారని చెప్పిన ఆయన, తప్పు చేసిన ప్రతి అధికారి సర్వీస్ రికార్డుల్లో శిక్షింపబడిరాడని ఆయన చెప్పారు.. పాదయాత్రకు అద్భుతంగా ప్రజల నుండి స్పందన వస్తొందని, లోకేష్ పాదయాత్రకు శ్రీవారి ఆశీస్సులు ఉండాలని, లోకేష్ కు దుష్టశక్తుల నుండి రక్షణ కల్పించాలని, లక్ష్యం పూర్తి చేసే విధంగా శక్తిని ప్రసాదించాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలియజేశారు.. అతిత్వరలోనే ఈ దుర్మార్గపు పరిపాలనకు ప్రజలు చరమగీతం పలుకబోతున్నారని, అవినాష్ రెడ్డి దొరికి పోయినా దొంగ అని, అవినాష్ రెడ్డి వెనుక ఇంకా అసలైన శక్తులు ఉన్నాయని, అందులో అవినాష్ రెడ్డి తండ్రి కూడా కేసులో ఉన్నారని, మరికొందరు త్వరలోనే బయట పడతారన్నారు.. ఇక గూగుల్ పే కోర్టు వాస్తవాలను బయట పెట్టిందని, కొన్న రకాలుగా వివేకానంద రెడ్డి హత్య చేసి కొన్ని రోజులు మభ్య పెట్టగలిగారని, టెక్నాలజీ, సిబిఐ మొత్తం విషయాలు బయట పెడుతుందన్నారు.. దొరికిన దొంగకు జైల్ కు వెళ్ళక తప్పదని ఆయన హెచ్చరించారు.. వివేకానంద హత్య కేసులో ఆధారాలను తప్పు దోవ పట్టించింది అవినాష్ రెడ్డే అని, తెల్లవారుజామున మూడు గంటల నుండి భారతీ ఓఎస్డి కృష్ణమోహన్ తో, జగన్ తో మాట్లాడింది అవినాష్ రెడ్డే అని ఆయన తెలిపారు.. వివేకానంద రెడ్డి సునిత చేస్తున్న పోరాటం వీరి మెడకు చుట్టుకుందని, ఇంకా ఇద్దరూ వ్యక్తులను విచారణకు పిలుస్తారని, వివేకానంద హత్యలో నిందుతులు, పాత్రదారులు తప్పించుకోలేరని ఆయన తెలియజేశారు..

# రోడ్ల మీద తిరుగుతున్న పట్టించుకునే నాథుడే లేడా

**పత్తికొండ**

పత్తికొండ పట్టణంలో కొంత మంది ఆవుల యజమానులు, తమ ఆవులకు మేత వేయకుండా, పాలు పిండుకొని బాధ్యతా రాహిత్యంగా తమ ఆవులను, వాటి దూడలను పట్టణంలోని రోడ్లపైన వదిలేస్తున్నారు. పత్తికొండ పట్టణంలో పాపం ఆ మూగ జీవాలు ఆకలితో అలమటిస్తూ రోడ్లపై దొరికే ఆహారం కోసం పోయి ప్రమాదాలకు గురి అవ్వుతు న్నాయి. ఈ ఆవులు రోడ్లపై అడ్డదిడ్డంగా తిరు గుతూ, ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై ప డుకోవడం వలన వాహనాలు ఢీకొని, గాయాల పాలవు తున్నాయి. వీటిని ఢీ కొట్టిన వాహన దారులు కూడా గాయాల పాలవుతున్నారు. ఆవులను రోడ్లపైకి వదలవద్దని పత్తికొండ పంచాయతీ అధికారులు ఈ ఆవుల యజమానులకు నోటీసులు ఇవ్వరు. జరిమానా





విధించరు. పత్తికొండ పంచాయతీ అధికారులు ఈ ఆవులను, వాటి దూడలను పట్టుకొని గోసంరక్షణ శాలకు తరలించి ఆవులు మరియు వాహన దారులు ప్రమాదాలకు గురికాకుండా కాపాడాలని పత్తికొండ పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# 6 నెలలు ఆగండి... మంచి రోజులు వస్తాయి

**నెల్లూరు :**

రు నెలలు ఆగండి.. మంచిరోజులొస్తాయని అంటున్నారు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. తాను ప్రస్తుతం అధికార పార్టీ ఎమ్మెల్యేని కాదని, అయినా కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి తనకు సంబంధం లేదని చెప్పడంలేదని, కచ్చితంగా ప్రజల కోసం పోరాడతానని చెప్పారు. జైళ్లకు పంపించుకున్నా, ఏం చేసినా, రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. జైల్లు, లాకప్ లు ఎప్పుడో చూశానని చెప్పారు. తనపై కోపంతో అయినా నెల్లూరు రూరల్ లో సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, అలా చేస్తే, రూరల్ నియోజకవర్గ పరిధిలో సమస్యలు పరిష్కరించగలిగితే తానే నేరుగా వెళ్లి సీఎం జగన్‌కి పూలమాల వేస్తానన్నారు. లేకపోతే పోరాటం తప్పదన్నారు. వచ్చే నెలనుంచి 141రోజుల ప్రజా ఆశీస్సుల యాత్ర చేపట్టబోతున్నట్టు తెలిపారు. వాస్తవానికి నెల్లూరులో నిరసన ప్రదర్శనలకోసం కోటంరెడ్డి భారీ ఎత్తున ఏర్పాట్లు చేసుకున్నారు. కలెక్టరేట్ ఎదుట, రోడ్లు, భవనాల శాఖ భవనం ఎదుట పెద్ద సంఖ్యలో జనసమీకరణ చేసి నిరసన ప్రదర్శన చేపట్టాలనుకున్నారు. కానీ ఎమ్మల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఆ కార్యక్రమాలకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆయన తన రూరల్ కార్యాలయంలోనే నిరసన ప్రదర్శనలు చేపట్టారు. నెల్లూరు రూరల్ పరిధిలో రోడ్లు, కాల్వలు, పొట్టేపాలెం కలుజుపై వంతెనకోసం ఆయన నిరసన



చేపట్టారు. బీసీ భవన్, అంబేద్కర్ భవన్ సమస్యల పరిష్కారం కూడా గళమెత్తారు. కొమ్మరపూడి లిఫ్టి ఇరిగేషన్ పనులు, కొమ్మరపూడి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు తానేదో అధికార పార్టీనుంచి బయటకు వచ్చి ఈ మాటలు చెప్పడంలేదని, గతంలో కూడా తాను ఈ సమస్యల పరిష్కారానికై గళమెత్తానని చెప్పారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఇప్పుడైనా సులభంగా రూరల్ సమస్యలు పరిష్కారమవుతాయని అంచనా వేసినా, అది కూడా సాధ్యం కాలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పార్టీలో ఉన్నా తాను మాత్రం తన నియోజకవర్గ సమస్యలు పరిష్కరించుకోలేకపోయానని చెప్పారు. గతంలో తాము ప్రతిపక్షంలో ఉండగా 23మంది వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీలోకి వెళ్లారని, వారిలో కొందరు మంత్రులు కూడా అయ్యారన చెప్పారు కోటంరెడ్డి. కానీ తాను ఆనాడు కష్టాల్లో ఉన్నా కూడా జగన్ చేయి వదిలిపెట్టలేదని, ఆయన్నే అంటిపెట్టుకుని ఉన్నానని చెప్పారు. ఇప్పుడు అధికార పార్టీ శాసన సభ్యుడిని అయినా కూడా ఏడాదిన్నరపాటు ఇంకా అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉండే అవకాశం ఉన్నా కూడా పార్టీని వదిలిపెట్టానని చెప్పారు. ఆనాడు తాను పార్టీ మారి ఉంటే మంత్రిని అయిఉండేవాడిని అని, ఈనాడు పార్టీనుంచి బయటకు రావడం వల్ల మరోసారి కష్టాలు అనుభవిస్తున్నానని చెప్పారు. రెండుసార్లు తాను తన సొంత లాభానికి నిర్ణయం తీసుకోలేదని, కేవలం ప్రజల కోసమే నిర్ణయం తీసుకున్నానని చెప్పారు కోటంరెడ్డి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి రోజూ ప్రశ్నిస్తూనే ఉంటానన్నారు కోటంరెడ్డి. తనమీద కోపం, తనపై కక్షతో అయినా ప్రభుత్వం నెల్లూరు రూరల్ లో వేగవంతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే అంతకంటే సంతోషం తనకింకేం లేదన్నారు. అలా జరగాలని ఆశిస్తున్నట్టు చెప్పారు.

# కమిషన్ వ్యాపారిపై రైతుల దాడి

**ఖమ్మం**


ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో రైతులకు కమిషనర్ వ్యాపారులకు మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో మార్కెట్ వద్ద ఉద్రిక్తత పరిస్దితి నెలకొంది. మిర్చిని అమ్ముకోవటానికి అడ్డుకున్న కమిషన్ వ్యాపారిపై రైతు కుటుంబం దాడికి పాల్పడగా, కమీషన్ వ్యాపారులు మార్కెట్ వద్ద ఆందోళన చేపట్టారు.

ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామానికి చెందిన రైతులు కమిషన్ వ్యాపారి వెంకటేశ్వర్లు దగ్గర పంటపెట్టుబడికి అప్పు తీసుకున్నారు. పంట పండిన తరువాత వెంకటేశ్వర్లుకే అమ్మే విధంగా ఒప్పందం చేసుకున్నారు ఈరోజు పంటను మార్కెట్ కి తీసుకొచ్చి రైతులు వ్యాపారి వెంకటేశ్వర్లు కమ్మకుండా మరొకరికి పంట నమ్ముతుండడంతో వెంకటేశ్వర్లు రైతులను అడ్డుకున్నాడు తన బాకీ చెల్లించి పంట నమ్ముకోవాలని రైతు ఈ విషయమై రైతులు వ్యాపారుల మధ్య ఘర్షణ చెలరేగి ఇరువర్గాలు ఒకరు కొట్టుకున్నారు దీంతో ఖమ్మం మిర్చి మార్కెట్ వద్ద ఉధృత పరిస్థితి నెలకొంది మార్కెట్లో కొనుగోలు నిలిపివేయాలని రైతుల అన్యాయంగా తమపై దాడికి దిగారని వ్యాపారులు ఖమ్మం మిర్చి మార్కెట్ వద్ద ఆందోళన దిగారు ఖమ్మం మార్కెట్ కి చేరుకున్న పోలీసులు పరిస్థితి చర్చలు జరిపారు.

# కబాడీపాలెం చర్చిలో వింత

**నెల్లూరు**

కబాడీపాలెం పరిశుద్ధ కానుక మాతచర్చి లో వింత సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శిలువకు వేలాడుతున్న యేసు క్రీస్తు బొమ్మ చేతులు కాళ్లు చేతుల నుంచి కారుతున్న రక్త దారలను తలపించే ద్రవాలు కారుతున్నాయి. వింతను చూసేందుకు జనాలు ఎగబడుతున్నారు. శిలువకు వెలాడ దీసి ఉన్న క్రీస్తు బొమ్మ చేతులు,కాళ్లకు దిగగొట్టిన మేకుల నుంచి ఎర్రటి ద్రవాలు కారుతున్నాయి.



ప్రజా తపన
prajathapana.com

# మిథున్ చక్రవర్తి కుమారుడు హీరోగా 'నేనెక్కడున్నా'



సీనియర్ హిందీ హీరో మిథున్ చక్రవర్తి కుమారుడు మిమో చక్రవర్తిని తెలుగు చిత్రసీమకు కథానాయకుడిగా పరిచయం చేస్తూ మాధవ్ కోదాడ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'నేనెక్కడున్నా'. దర్శకుడిగా ఆయనకు కూడా తొలి చిత్రమిది. ఇందులో ఎయిర్ టెల్ ఫేమ్ సశా ఛెత్రి కథానాయిక. కె.బి.ఆర్ సమర్పణలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు టైటిల్ వెల్లడించడంతో పాటు పోస్టర్, టీజర్ విడుదల చేశారు.

'నేనెక్కడున్నా' టైటిల్, టీజర్ విడుదల అనంతరం సురేష్ బాబు మాట్లాడుతూ "టీజర్ చాలా ఆసక్తికరంగా ఉంది. కథ బాగుంటే కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమాలకు, ఇటువంటి కొత్త ప్రయత్నాలకు ప్రేక్షకుల ఆదరణ లభిస్తుంది. సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను. దర్శక, నిర్మాతలకు ఆల్ ది బెస్ట్" అని చెప్పారు.

చిత్ర దర్శకుడు మాధవ్ కోదాడ మాట్లాడుతూ "జర్నలిజం, రాజకీయం నేపథ్యంలో వస్తున్న థ్రిల్లర్ చిత్రమిది. ఊహించని మలుపులతో సినిమా సాగుతుంది. ఈ సినిమాతో హిందీ హీరో మిథున్ చక్రవర్తి కుమారుడు మిమో చక్రవర్తిని తెలుగు తెరకు పరిచయం చేస్తున్నాం" అని చెప్పారు.

చిత్ర నిర్మాత మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ "సినిమా చిత్రీకరణ పూర్తి అయ్యింది. ముంబై, హైదరాబాద్, బెంగళూరులో షూటింగ్ చేశాం. ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. ప్రస్తుతం సెన్సార్ సన్నాహాల్లో ఉన్నాం. స్టోరీ, మ్యూజిక్, విజువల్స్, డైరెక్షన్ మా సినిమాకు బలం. ప్రముఖ కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ నృత్య దర్శకత్వంలో రష్యన్ డాన్సర్లతో చేసిన పబ్ సాంగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. సెన్సార్ పూర్తయ్యాక విడుదల తేదీ వివరాలు వెల్లడిస్తాం. త్వరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నాం" అని చెప్పారు.

# 'ఇన్ కార్' అందరూ తప్పకుండా చూడాల్సిన సినిమా




నేషనల్ అవార్డ్ విన్నర్, 'గురు' సినిమా ఫేమ్ రితిక సింగ్ ప్రధాన పాత్రలో రూపొందిన సర్వైవల్ క్రైమ్ థ్రిల్లర్ డ్రామా 'ఇన్ కార్'. ఇన్‌బాక్స్ పిక్చర్స్ బ్యానర్ పై అంజుమ్ ఖురేషి, సాజిద్ ఖురేషి నిర్మిస్తున్న ఈ చిత్రానికి హర్ష వర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రంలో సందీప్ గోయత్, మనీష్ ఝుంజోలియా, జ్ఞాన్ ప్రకాష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. 'ఇన్ కార్' మార్చి 3న తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో థియేట్రికల్ గా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది.


ప్రెస్ మీట్ లో రితిక సింగ్ మాట్లాడుతూ : 'ఇన్ కార్' చాలా సీరియస్, కంప్లీట్ రా ఫిల్మ్. ఈ సినిమా షూటింగ్ చాలా డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్. చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ పాత్ర చేసే అవకాశం ఇచ్చిన దర్శకుడు హర్ష కు కృతజ్ఞతలు. చాలా భావోద్వేగానికి గురి చేసిన పాత్రది. చివరి క్షణం వరకూ పోరాడే పాత్ర చేశాను. కొన్ని సీన్లు చేస్తున్నపుడు టీం అంతా ఏడ్చేసేవారు. అందరూ చూడాల్సిన సినిమా ఇది. అందరికీ రీచ్ అవుతుందనే నమ్మకం వుంది. దురదృష్టవశాత్తు అత్యాచారంకు సంబంధించిన వార్తలు హెడ్ లైన్స్ లో రోజూ చూస్తుంటాం. ఎలాంటి పరిస్థితులు ఇలాంటి దారుణమైన సంఘటనలకు దారితీస్తాయనేది ఇందులో చూపించాం. చాలా ముఖ్యమైన టాపిక్ ఇది. ఈ కథ విన్నప్పుడే నటనకు ఆస్కారం వుండే పాత్ర చేయబోతున్నానని అర్ధమైయింది. దాదాపు షూటింగ్ కార్ లో చేశాం. ఈ కథకు కంటిన్యూటీ చాలా ముఖ్యం. ఈ సినిమా షూటింగ్ పూర్తయిన వరకూ నేను తల స్నానం చేయలేదు. 'ఇన్ కార్' రియల్, డిస్టర్బింగ్ ఫిల్మ్. కానీ చివర్లో ఒక గొప్ప హోప్ ని ఇస్తుంది. అందరూ 'ఇన్ కార్' ని తప్పకుండా చూడాలి" అన్నారు.

# విశ్వక్సేన్ సినిమాస్ 'దాస్ కా ధమ్కీ' షూటింగ్ పూర్తి



డైనమిక్ హీరో విశ్వక్ సేన్ తన తొలి పాన్ ఇండియా చిత్రం 'దాస్ కా ధమ్కీ' అత్యంత భారీ బడ్జెట్‌తో అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తున్నారు. విశ్వక్ ఈ చిత్రానికి కథానాయకుడు, దర్శకుడు, నిర్మాత కూడా. ఈ చిత్రంలో విశ్వక్ సేన్ కు జోడిగా నివేదా పేతురాజ్ నటిస్తోంది. నేటితో ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. త్వరలోనే రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేయనున్నారు మేకర్స్. ఇప్పటివరకూ విడుదలైన 'దాస్ కా ధమ్కీ' ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఆల్మోస్ట్ పడిపోయిందే పిల్ల, మావాబ్రో పాటలు చార్ట్ బస్టర్స్ గా నిలిచాయి. 'దాస్ కా ధమ్కీ' ట్రైలర్ నేషనల్ వైడ్ గా ట్రెండ్ అయ్యింది.

వన్మయే క్రియేషన్స్, విశ్వక్సేన్ సినిమాస్ బ్యానర్లపై కరాటే రాజు నిర్మిస్తున్న ఈ సినిమా ప్రసన్న కుమార్ బెజవాడ డైలాగ్స్ రాశారు. ఈ చిత్రానికి దినేష్ కె బాబు సినిమాటోగ్రఫర్ గా, లియోన్ జేమ్స్ సంగీతం అందించగా, అన్వర్ అలీ ఎడిటర్ గా పని చేస్తున్నారు. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రం




# మార్చి 3న ఆర్గానిక్ మామ'హైబ్రిడ్ అల్లుడు'రిలీజ్



ఫ్యామిలీ కథా చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన స్టార్ డైరెక్టర్ "ఎస్వీ కృష్ణారెడ్డి", తాజాగా తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆర్గానిక్ మామ'హైబ్రిడ్ అల్లుడు'. కె. అచ్చిరెడ్డి సమర్పణలో అమ్ము క్రియేషన్స్, ప్రఖ్యాత బ్యానర్ కల్పన చిత్ర పతాకంపై శ్రీమతి కోనేరు కల్పన నిర్మిస్తున్న ఈ చిత్రంలో నటకిరీటి డా. రాజేంద్రప్రసాద్'మీనా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. బిగ్‌బాస్ ఫేం సోహెల్'మృణాళిని హీరో, హీరోయిన్‌లుగా నటించారు. ఈ సినిమా మార్చి 3న రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. ఇక ఈ మూవీలోని ఇతర ముఖ్య పాత్రల్లో దాదాపు సినీ పరిశ్రమలోని ప్రముఖ నటులు అందరూ నటిస్తుండటం విశేషం. అలాగే తన చిత్రాలకు కథ, స్క్రీన్‌ప్లే, సంగీతం, దర్శకత్వం వహించే కృష్ణారెడ్డిగారు ఈ చిత్రానికి మాటలు కూడా రాయడం మరో విశేషం.

సునీల్, కృష్ణభగవాన్, సన, ప్రవీణ్, సప్తగిరి, అజయ్‌ఘోష్, రాజా రవీంద్ర, సురేఖ వాణి, పృథ్వీ, చలాకీ చంటి, సూర్య, రాజారవీంద్ర తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: సి. రాంప్రసాద్, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, ఆర్ట్: శివ, పాటలు: చంద్రబోస్, రామజోగయ్య, శ్రీమణి, సమర్పణ: కె. అచ్చిరెడ్డి, నిర్మాత: కోనేరు కల్పన, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, సంగీతం, దర్శకత్వం: ఎస్వీ కృష్ణారెడ్డి.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950